యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

మాజీ మంత్రి డాక్టర్ ఏ.చంద్రశేఖర్



నవతెలంగాణ-జహీరాబాద్ 81

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, దాంతో యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని మాజీమంత్రి డాక్టర్ ఏ.చంద్రశేఖర్ అన్నారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని రంజోల్‌లో క్రికెట్ ప్రీమియర్ లీగ్ 14 టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి మ్యాచ్ ప్రారంభించి కాసేపు క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దసర సెలవులను దృష్టిలో ఉంచుకొని క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. యువకులు క్రీడా రంగంలో కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉందని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడారంగంలో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. క్రికెట్ విజేతలకు రూ.50.వేల నగదు ప్రొత్సాహం అందించి, బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జావీద్, ఖాజామీయా, రాములు, తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకలో సీపీఐ(ఎం) బతుకమ్మ

- శ్రమజీవుల బతుకమ్మకు ఘనంగా నిమజ్జనం





నవతెలంగాణ-దుబ్బాక

సద్దుల బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ కేంద్రంలో సీపీఐ(ఎం) బతుకమ్మను పేర్చారు. చుట్టూరా ఎర్రని పూలు, మధ్యలో తెల్లని పూలతో సుత్తే కొడవలి గుర్తును అందంగా అలంకరించారు.సీపీఐ(ఎం) దుబ్బాక మండల నాయకులు కొంపల్లి భాస్కర్ - వెంకటలక్ష్మి దంపతులు తయారు చేసిన ఈ బతుకమ్మ చూపరులను ఆకట్టుకుంటూ పలువురిచే ప్రశంసలు అందుకుంది. శ్రమజీవుల చిహ్నామైన సుత్తే, కొడవలి బతుకమ్మను దుబ్బాక పట్టణ కేంద్రంలోని పెద్ద చెరువులో ఘనంగా నిమజ్జనం చేశారు.

బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌లో బతుకమ్మ వేడుకలు
వర్షంలో సైతం ఉత్సాహంగా సాగిన బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలం, మున్సిపాలిటీ పరిధిలో సద్దుల బతుకమ్మ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఎల్లమ్మ చెరువు వద్ద మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత బతుకమ్మ ఏర్పాట్లను పెద్ద ఎత్తున చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని ఆడపడుచులు వర్షం కురుస్తున్న బతుకమ్మలతో ఎల్లమ్మ చెరువు కట్టకు చేరారు. ఒకవైపు భారీ వర్షం సైతం లెక్కచేయకుండా మహిళలు చిన్న పెద్ద తేడా లేకుండా బతుకమ్మ పాటలు, కోలాటాలతో ఉత్సాహంగా సంబరాలు చేసుకున్నారు. హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ బతుకమ్మలు తీసుకెళ్తున్న మహిళలను వర్షంలో సైతం ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా పలకరించుకుంటూ బతుకమ్మ శుభాకాంక్షలు చెప్పుకుంటూ ముందుకు సాగారు. వర్షంలో బతుకమ్మలు తీసుకొని మహిళలు ఒకేసారి కదలడంతో ఎల్లమ్మ చెరువు వైపు వాహనాలు, బతుకమ్మను తీసుకెళ్తున్న పాదాచారులతో కిక్కిరిసిపోయింది. మంత్రి పొన్నం ప్రభాకర్ పోలీసులకు సూచనలు చేస్తూ తానే స్వయంగా వాహనాలను ట్రాఫిక్ క్లియర్ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ రూట్ల ద్వారా వాహనాలను మళ్లించారు. చెరువు వద్ద బతుకమ్మలు వేసే సందర్భంలో జాగ్రత్తగా ఉండాలని మంత్రి సూచించారు. విద్యుత్ దీపాల వెలుగుల మధ్య మహిళలు పోయి రా... బతుకమ్మ...మళ్ళీ రా బతుకమ్మ అంటూ వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వెంట హుస్నాబాద్ ముఖ్య నేతలు అధికారులు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

నవతెలంగాణ-సంగారెడ్డి



జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర అధ్యక్షతన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణం నందు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఒత్తిడి వల్ల వ్యక్తి చాలా మానసికంగా శారీరకంగా కృంగిపోతాడని ఒత్తిడిని చిత్తు చేయాలన్నారు. ముఖ్యంగా మహిళ ఉద్యోగులు ఇంట్లో పని ప్రదేశాలలో పనిచేస్తూ చాలా ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఎవరికి వారే ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, న్యాయవాదులు ఎలా జయించాలో మానసిక ఆరోగ్య ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీ చిట్కాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె. జయంతి, రెండవ అదనపు జిల్లా జడ్జి డాక్టర్ కృష్ణ అర్జున, మూడవ అదనపు జిల్లా జడ్జి సునీత రవీందర్ రెడ్డి, నాలుగవ అదనపు జిల్లా జడ్జి లావణ్య బాల్ రెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహన్, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి బి.రమేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి లక్ష్మణ చారి, అదనపు ప్రథమ శ్రేణి జడ్జి శాలిని, ఎక్సైజ్ కోర్టు జడ్జి తేజ శ్రీ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రసిక్యూషన్ రాజేశ్వర్, పబ్లిక్ క్లాసిక్యూటర్స్ బార్ జనరల్ సెక్రటరీ అంబరీష్, డాక్టర్ లక్ష్మి, కోర్టు సిబ్బంది న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో చంటి పిల్ల కిడ్నాప్‌పై సమగ్ర విచారణ జరపాలి

నిర్లక్ష్యం వహించిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి
సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్
హాస్పిటల్ సూపరిండెంట్‌కు సీపీఐ(ఎం) వినతి



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా కేంద్రం ప్రభుత్వ ఆసుపత్రిలో చంటి పాప కిడ్నాప్ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, నిర్లక్ష్యం వహించిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు. గురువారం హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ అనిల్ కుమార్‌కు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో పుట్టిన పసిపాపను గుర్తుతెలియని దుండగులు కిడ్నాప్ చేయడం దుర్మార్గమని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అందరి కండ్ల ముందే కిడ్నాప్ చేయడం చూస్తుంటే పక్కగా కిడ్నాప్ చేసినట్టు ఉందన్నారు. కిడ్నాపర్లను పట్టుకొని కఠినంగా శిక్షించాలని, పసిపాపను వాళ్ళ తల్లిదండ్రులకు అప్పగించాలన్నారు. ఈ ఘటనపై ఉన్నంత అధికారులతో సమగ్ర విచారణ జరిపి నిర్లక్ష్యం వహించిన ఉద్యోగులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు ప్రవీణ్ కుమార్, దాస్ తదితరులు పాల్గొన్నారు.

పండగ వేళ ధరల మోత



'ఏం కొనేటట్టులేదు ఏం తినేటట్టులేదు...నాగులో నాగన్న. ఈ ధరల మీద మన్నుబోయ నాగులో నాగన్న' అనే పాట గుర్తుకొస్తుంది. దసరా పండగ వేళ ధరలు మరీ మోత మోగుతున్నాయి. నిత్యవసరాలు, కూరగాయల ధరలు ఆకాశానంటుతున్నాయి. దిగిరాని ఉల్లి...ఉటెక్కిన వెల్లుల్లి. వంట నూనెలు, పప్పులు, బియ్యం ఇలా ఏ సరుకు కొందామన్నా ధరల పోటు సామాన్యులను తల్లడిల్లేలా చేస్తుంది. బతుకమ్మ పండగ వేళ పూల ధరలు మండుతున్నాయి. దసరా పేర చికెన్, మటన్, మందు ధరలు కూడా పెంచేస్తున్నారు. ఏ వస్తువులు జోలికెళ్లినా ధరలు అందుకోలేనంతా పెరిగిపోవడంతో పండగ పూట పచ్చడి మెతుకులతో గడిపే పరిస్థితి నెలకొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల నియంత్రణను ఎత్తేసిన ఫలితంగానే మార్కెట్‌లో ధరలు నిలకడగా ఉండట్లేదు.

- మండుతున్న నిత్యవసరాలు, కూరగాయలు
- ఉటెక్కిన వెల్లుల్లి...దిగిరాని ఉల్లి
- పెరిగిన నూనెలు, పప్పుల రేట్లు
- నెల నెలా ధరల పెరుగదలతో సామాన్యుడు విలవిల
- పండగ పూట చికెన్, మటన్ ధరల పెంపు

సరుకు	ధర	సరుకు	ధర
బియ్యం క్వింటాల్	రూ.7000	క్యాప్సికమ్	రూ.80
వెల్లుల్లి కిలో	రూ.450	చామగడ్డ	రూ.80
అల్లం ,,	రూ.200	బీన్స్	రూ.80
ఎండుమిర్చి	రూ.220	బెండ	రూ.80
కందిపప్పు	రూ.180	ఉల్లిగడ్డ	రూ.70
చింతపండు	రూ.140	దొండ	రూ.60
నూనెలు	రూ.135	బీర	రూ.60
పెసరపప్పు	రూ.130	క్యారెట్	రూ.60
శనగపప్పు	రూ.120	టమాటా	రూ.60

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉప్పు, పప్పులే కాదు కారం, నూనె, బియ్యం, అల్లంవెల్లుల్లి, ఉల్లి చింతపండు ఇలా నిత్యవసరాలన్నీ పిరమైయ్యాయి. సాధారణ రోజుల్లో కంటే దసరా పండగ వేళ మరింత రెట్టించి అమ్ముతున్నారు. ఇంట్లోకి నిత్యవసర సరుకులే కాదు పండగ కోసం బట్టలు, మటన్, చికెన్ ధరలు కూడా మండిపోతున్నాయి. గతేడాది దసరా పండగ వేళ ఉన్న ధరలు ఈ సారి పండగొచ్చే సరికి రెండింతలయ్యాయి. కూరగాయలు, పూలు, పండ్లు, టపాసులు ఇలా ఏది కొందామన్నా కుటుంబ బడ్జెట్‌ను అతలాకుతలం చేస్తున్నాయని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఏ మార్కెట్‌కెళ్లినా ఏ సరుకు కొందామన్నా మండే ధరల్ని చూసి జనం వెనకడుగేస్తున్నారు. ఏమోమో కొనాలని మార్కెట్‌కు వెళ్లిన వాళ్ల తమ బడ్జెట్‌కు తగినట్టుగా కుదించి సరుకుల్ని కొనుకుంటున్న పరిస్థితి ఉంది. సంగారెడ్డి, సిద్దిపేట, జహీరాబాద్, పటాన్‌చెరు, మెదక్, గజ్వేల్ వంటి పట్టణాల్లో కాస్త రద్దీ కనిపిస్తున్నా ధరల ప్రభావంతో కొనుగోళ్ల ఆశించిన మేరకు సాగట్లేదని పలువురు వ్యాపారులు సైతం గునుస్తున్నారు. సాధారణంగానే మార్కెట్‌లో వివిధ రకాల వస్తుల ధరలు విపరీతంగా పెరిగాయి. వాటికి తోడు పండగ కావడంతో స్థానికంగా కూడా కొంత పెంచి విక్రయిస్తుండడంతో వినియోగదారులు అల్లాడిపోతున్నారు.

మండుతున్న నిత్యవసరాల ధరలు

పేద, మధ్యతరగతి కుటుంబాల్లోనే కాదు సంపన్నుల ఇంట్లో సైతం విధిగా వాడే బియ్యం ధరలు మండుతున్నాయి. గతేడాది క్వింటాల్ బియ్యం ధర ప్రస్తుతం రూ.700 పైనే ఉంది. జైశ్రీరాం అనే సన్న రకం బియ్యం 25 కిలోల ధర రూ.1900 ఉంది. సోనమసూరి ఇతర రకాలు కూడా ఇదే రీతిగా ధర పలుకుతుంది. ఇక నూనెల ధరలు ఈ రెండు వారాల్లో కిలోకు రూ.30 వరకు పెరిగింది. గతేడాది ప్యాకెట్ ధర రూ.110 ఉండగా ఇప్పుడు రూ.135 అయ్యింది. చింత పండు రూ.100 నుంచి రూ.140కి ఎగబాకింది. ఎండుమిర్చి కిలో ధర రూ.140 ఉండగా ఇప్పుడు రూ.220 ఉంది. అంటే కారం తినకుండానే ఘాటు దంచికొడుతుంది. కందిపప్పు రూ.180, పెసర రూ.130, శనగ రూ.120 వరకు ధరలున్నాయి.

కిలో బదులు... పావుకిలోతోనే సరి

నిత్యం ఆహారంలో వినియోగించే కూరలకు సంబంధించి కూరగాయలు, ఆకుకూరల ధరలు కూడా ప్రియమయ్యాయి. దీంతో మార్కెట్‌కెళ్లి వాళ్ల కిలో బదులు పావుకిలో మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో చామగడ్డ, క్యాప్సికమ్, బీన్స్, బెండ కిలో రూ.80, దొండ, బీర, క్యారెట్ రూ.60, ఆలు, టమాటా, కీర, వంకాయ ఇతర కూరగాయలన్నీ కూడా రూ.50 కంటే తక్కు ధరలేదు. టమాటా రెండు రోజుల క్రితం వరకు రూ.100 కిలో కూడా మార్కెట్‌లో లభించలేదు. కోతిమీర, పుదీన, పాలకూర, గోంగూర, తోటకూరలు సైతం కట్టకు పది నుంచి ఇరవై రూపాయలైంది.

ఉట్టెక్కిన వెల్లుల్లి... దిగిరాని ఉల్లి

వంటలు రుచికరంగా ఉండాలంటే తప్పని సరిగా వినియోగించే అల్లంవెల్లుల్లి కొనలేని పరిస్థితి నెలకొంది. వెల్లుల్లి ధర ఉట్టెక్కి దిగనంటోంది. ఇక ఉల్లి సైతం ధర గిరాని పరిస్థితి ఉంది. ఈ రెండు సరుకులు కూడా మరింత ప్రియం అవుతాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అల్లంవెల్లుల్లి రెండు కలిపే కొనాలి. కలిపే వంటల్లో వాడాలి. ఏది లేకపోయినా మరోటి వినియోగించలేము. అల్లం ధర కిలో రూ.200 ఉండగా వెల్లుల్లి ధర మాత్రం కిలో రూ.450 ఉంది. రెండో రకం వెల్లుల్లి మాత్రం రూ.350కి దొరకుతోంది. దీంతో సామాన్యులు, పేదలు అల్లంవెల్లుల్లిని వాడడమే మానేశారు. దసరా పండగ వేళ మాంసహారం వంటల్లో తప్పనిసిగా వాడాల్సి ఉన్నందున పావుకిలో కంటె ఎక్కువ కొనట్లేదని పలువురు మహిళలు పేర్కొంటున్నారు. వర్షాల వల్ల పంట దెబ్బతిన్న ప్రభావంతో ఉల్లి ధరలు కూడా తగ్గట్లేదు. కిలో రూ.70 ఉన్నా రాబోయే కొద్ది రోజుల్లోనే కిలో ధర రూ.100 దాటే ప్రమాదముందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.



దరసా దోపిడీ

మార్కెట్లన్నీ జనాలతో కిక్కిరి కనిపిస్తున్నాయి. ధరల ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ దసరా పండగను తెలంగాణ పరగణలో ఘనంగా జరుపుకుంటారు. బతుకమ్మ దసరా రెండు ఒకే వేళ వచ్చే పండగలు కావడంతో ఆడపడుచులు పుట్టింటికి వస్తారు. దసరాకు కొత్తబట్టలు కొనుకోవడం, పిండి వంటలు, మటన్,చికెన్ వంటి మాంసహారం వండుకోవడం, పిల్లలు టపాసులు పేల్చడం ఆనవాయితీగా వస్తుంది. దీంతో మార్కెట్‌లో వ్యాపారులు పెరిగిన ధరలకు తోడుగా ఇంకొంత పెంచి విక్రయిస్తున్నారు. రెడీమెడ్ వస్త్రదుకాణాల్లో ప్యాంట్, షర్ట్, వస్త్రాలయాల్లో చీరలు, దోతులు, ఇతర బట్టల్ని ధరలు పెంచి విక్రయిస్తున్నారు. ముఖ్యంగా బ్రాండెడ్ కంపెనీల పేర్లు చెప్పి ఫిక్స్‌డ్ రేట్లంటూ దోచుకుంటుకున్నారు. మాగల్య, చందన బ్రదర్స్, జీన్స్ కార్నర్, రిలయన్స్ వంటి పెద్ద షాపులతో పాటు స్థానిక వ్యాపారులు కూడా బట్టల్ని అధిక ధరలతో అమ్ముతున్నారు. ఇక పిల్లలు కొనే టపాసుల ధరలైతే మూడింతలు పెంచి అమ్ముతున్నారు. లైసెన్స్, పోలీసులు, ఫైర్ స్టేషన్‌కు మాముళ్ల పేరు వినియోగదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. ఇక మటన్ కిలో రూ.750 నుంచి రూ.800 ఉండేది. ఇప్పుడది వెయ్యికి ఎగబాగనుంది. చికెన్ సైతం పేపర్ రేట్‌ను పెంచి అమ్మనున్నారు.

కార్మిక సంక్షేమం సీఐటీయూతోనే సాధ్యం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు
- కిర్బీ పరిశ్రమలో 69 మంది కార్మికులకు పర్మినెంట్ ధ్రువపత్రాలు అందజేత



నవతెలంగాణ-పటాన్‌చెరు

కార్మికుల కష్టసుఖాల్లో అండగా నిలుస్తూ వారి సంక్షేమమే ధ్యేయంగా సీఐటీయూ ముందుకు వెళతుందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు అన్నారు. గురువారం మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో గల కిర్బీ పరిశ్రమలో కొత్తగా 69 మందికి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, పరిశ్రమ డైరెక్టర్ పిలిపోస్, హెచ్ ఆర్ వైస్ ప్రెసిడెంట్ రాజమహేంద్రల చేతుల మీదుగా అపాయింట్మెంట్ లెటర్స్ అందజేశారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ పరిశ్రమలో గతంలో 44 మందిని పర్మినెంట్ చేయగా ఇప్పుడు కొత్తగా 69 మందిని పర్మనెంట్ చేయడం జరిగిందన్నారు. పర్మనెంట్ చేయడం ఒక సీఐటీయూకే సాధ్యమని ఆయన చెప్పారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని, ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించుకోవచ్చన్నారు. పరిశ్రమ డైరెక్టర్ పిలిపోస్ మాట్లాడుతూ కంపెనీ అభివృద్ధికి కార్మికులు కృషి చేయాలని, కంపెనీ బాగుంటేనే కార్మికులకు సౌకర్యాలు కల్పించడం సాధ్యమవుతుందన్నారు. కొత్త అపాయింట్మెంట్ లెటర్స్ అందుకున్న కార్మికులకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య, యూనియన్ నాయకులు వీఎస్ రాజు, నాగప్రసాద్, తలారి శ్రీనివాస్, మల్లేష్, ఏడుకొండలు, లక్ష్మణ్, లఖాన్, హెచ్ఆర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై.అశోక్ కుమార్



నవతెలంగాణ-సంగారెడ్డి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 30 వేల పాఠశాలలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వై.అశోక్ కుమార్ అన్నారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షులు సంజీవయ్య అధ్యక్షతన సంగారెడ్డిలోని టీపీటీఎఫ్ ఉపాధ్యాయ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టి పి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్ కుమార్ మాట్లాడుతూ ఒకటి నుంచి మూడు తరగతులను అంగన్ వాడీ కేంద్రాలలో కలపే ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలని, ప్రస్తుతం నడుస్తున్న ప్రాథమిక పాఠశాలలోనే పూర్వ ప్రాథమిక విద్యను బోధించాలని డిమాండ్ చేశారు. అందుకు సుశిక్షితులైన ఉపాధ్యాయులను నియమించాలన్నారు. రాష్ట్రంలో ఉన్న 17 విశ్వ విద్యాలయాలలో పూర్తి స్థాయి ఫ్యాకల్టీ నియమించాలన్నారు. పాఠశాల విద్యలో ఖాళీగా ఉన్న డియిఓ , డిప్యూటీ డియిఓ , ఎంఈవో, డైట్ లెక్చరర్స్ , జూనియర్ లెక్చరర్స్ పోస్టులను భర్తి చేసి, మానిటరింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంలో వస్తున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి బదులుగా విశ్వవిద్యాలయాలను పాలిటెక్నిక్ కళాశాలలను, ఐటిఐలను అభివృద్ధి చేసి తెలంగాణ యువతకు ఉద్యోగులు వచ్చే నైపుణ్యాలను నేర్పించాలన్నారు.టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రామచందర్ మాట్లాడుతూ అశాస్త్రీయ మైన ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులు 25ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు సురేష్ , ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి శ్రీధర్ , కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్‌లు మాట్లాడుతూ పాఠశాలలన్నింటిలో సెమి రెసిడెన్షియల్ పద్ధతిలో అన్ని వసతులు సౌకర్యాలతో కేంద్రీయ పాఠశాల స్థాయికి అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ లక్ష్మయ్య యాదవ్, ఉపాధ్యక్షులు విజయ్ భాస్కర్ , కార్యదర్శి అశోక కుమార్, ఐట నాయకులు సిరాజ్ అహమ్మద్, ముజీబ్, మొయిజోద్దిన్, పిడిఎస్‌యు నాయకులు సందీప్ కుమార్, సాత్విక గౌడ్, అనిల్ కుమార్, ఇమ్మయ్య, దుర్గ ప్రసాద్, వేణుగోపాల్, కెవిపిఎస్ నాయకులు అశోక్ దాస్, పుండరికం, మొదలగు వారు పాల్గొన్నారు.

అంబరాన్ని అంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు

- ఆడి పాడిన మహిళలు
- సాకి చెరువు కట్టపైన వెల్లివిరిసిన తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు
- అలరించిన జానపద గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన రేలా రే రేలా గంగ, బిత్తిరి సత్తి
- విజేతలకు నగదు బహుమతుల అందచేత ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



నవతెలంగాణ-పటాన్‌చెరు

సద్దుల బతుకమ్మ సంబరాలు పటాన్చెరులో అంబరాన్ని అంటాయి. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని సాకి చెరువు కట్టపై గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన సద్దుల బతుకమ్మ సంబరాల్లో వేలాదిమంది మహిళలు తమ బతుకమ్మలతో హాజరయ్యారు. ప్రముఖ జానపద గాయని రేలారే రేలా గంగా ఆధ్వర్యంలోని బృంద సభ్యులు ఆలపించిన బతుకమ్మ గీతాలకు అనుగుణంగా మహిళలు బతుకమ్మ ఆడారు. బిత్తిరి సత్తి హాస్యం అందరినీ అలరించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో ప్రకృతిని ప్రేమిస్తూ..పూలను పూజించే అరుదైన పండుగ బతుకమ్మ పండుగ అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడంలో పటాన్చెరు పట్టణ ప్రజల సహకారం, మద్దతు అత్యంత కీలకమన్నారు. పటాన్చెరు ప్రజలకు జీవితాంతం తమ కుటుంబం రుణపడి ఉంటుందని తెలిపారు. గత 12 సంవత్సరాలుగా బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరి ఆనందంలో పాలుపంచుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ పట్టణ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం ఉత్తమ బతుకమ్మలకు నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.15 వేలను విజేతలకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కుమార్తె, కోడలు, మనుమరాళ్లు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి అందరిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ సపాన దేవ్, గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బల్దియా డిప్యూటీ కమిషనర్ సురేష్, పట్టణ పుర ప్రముఖులు, గూడెం కుటుంబ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

గీతంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



నవతెలంగాణ-పటాన్‌చెరు

పనిచేసే చోట మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇతివృత్తంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని' గురువారం నిర్వహించారు. డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వృత్తిపరమైన వాతావరణంలో మానసిక ఆరోగ్య సమస్యలను పరిష్కరించడం ప్రాముఖ్యతను చాటి చెప్పారు. మానసిక ఆరోగ్యం, దాని ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడానికి బృంద చర్చలు, వక్తృత్వ పోటీలు, విలువలను చాటి చెప్పే ప్రదర్శనలు ఈ సందర్భంగా ఏర్పాటు చేశారు. ఈ అంశంపై ఓ చలన చిత్ర ప్రదర్శనతో పాటు స్వాంతన చేకూర్చే మాటల పేరుతో ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వీటిలో పాల్గొన్న వారికి రోజువారీ జీవితంలో, ముఖ్యంగా కార్యాలయంలో మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యతపై లోతైన అవగాహనను కల్పించారు. మానసిక స్థితిస్థాపకతను నిర్మించడం, కళాశాల నుంచి కెరీర్‌కు పరివర్తనలో వృద్ధి చెందడం' అనే అంశంపై నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఉడాన్ కన్సల్టెంట్ డాక్టర్ ప్రియాంక శర్మ, ప్రముఖ బహుళజాతి సంస్థ కార్పొరేట్ సైకాలజిస్ట్ దేబన్ విట్టా కహలీ, గీతం అధ్యాపకులు ప్రొఫెసర్ డీఆర్ పీ చంద్రశేఖర్, డాక్టర్ సాకిబ్ ఖాన్, సుబ్బు పేటేటి, డాక్టర్ నవ్య సంకీర్తన, విద్యార్థిని దీక్షిత తదితరులు పాల్గొన్నారు. మానసిక ఆరోగ్యం గురించి బహిరంగ చర్చలను ప్రోత్సహించడం, ప్రతిష్టకు మచ్చతెచ్చే వాటిని ముందుగానే నివారించడం, వ్యక్తిగత, వృత్తిపరమైన కార్యకలాపాలలో ప్రజలు ఎదుర్కొనే మానసిక క్షేమ సవాళ్లను ప్రతిబింబించేలా ఇందులో పాల్గొనే వారిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు సాగాయి. వీటిని నిర్వహించడం ద్వారా, గీతం హైదరాబాద్ మానసిక ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, అందుబాటులో ఉన్న సహాయక వ్యవస్థలపై అవగాహన పెంచే ప్రపంచ ఉద్యమానికి తనవంతు చేయూతను అందించింది.



ప్రకృతిని, పూలను పూజించే పండగ బతుకమ్మ

నీలం మధు ముదిరాజ్
చిట్కుల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు
మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన నీలం మధు సతీమణి నీలం కవిత





నవతెలంగాణ - పటాన్‌చెరు

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా ప్రకృతిని, పూలను ఆరాధించే పండుగ బతుకమ్మ అని మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ కాంగ్రెస్ పార్టీ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం చిట్కుల్ లో జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రమంతా గ్రామ గ్రామాన అక్క చెల్లెలు సంబరంగా నిర్వహించుకునే పూల పండగ బతుకమ్మ అన్నారు. బతుకమ్మ పాటలతో ఆటలతో తమ సంతోషాన్ని ఇతరులతో పంచుకునే సామాజిక సంబురం ఈ పండగ అని కొనియాడారు. పూలనే దేవతగా కొలిచే గొప్ప సంస్కృతి, సాంప్రదాయం మన తెలంగాణకే దక్కిందన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం, అస్తిత్వానికి ప్రతీకగా ఈ పండుగ నిలుస్తుందనీ స్పష్టం చేశారు. మహిళలందరూ భక్తిశ్రద్ధలతో బతుకమ్మ సంబరాలు చేసుకోవాలని కోరారు. ఆ గౌరీ మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో పరిడవిల్లాలని ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో మహిళలు, ప్రజాప్రతినిధులు,గ్రామస్తులు పాల్గొన్నారు............

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
2
శుక్రవారం 11 అక్టోబర్ 2024 www.navatelangana.com

జట్పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో గురువారం ఏర్పాటు చేసిన జట్పీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను సెట్విన్ చైర్మెన్ ఎస్.గిరిధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాటాడుతూ.. ఈ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని, ఇందులో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. క్రీడల పట్ల జహీరాబాద్ యువత ఎంతో ఆసక్తి చూపడం హర్షించదగ్గ విషయమన్నారు. క్రీడలు మానసికంగా ధృడంగా, ఆరోగ్యంగా, ఆనందంగా ఉండడానికి ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్లు రాములు నేత, యూనస్, జహంగీర్, మోతజ్, ముదిరాం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మాజీ సొసైటి చైర్మన్‌లు, యూత్ కాంగ్రెస్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుధ పూజ నిర్వహించిన జిల్లా ఎస్పీ



నవతెలంగాణ-సంగారెడ్డి: దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా సాయుధ పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజ, వాహన పూజలను జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్, అదనపు ఎస్పీ ఎ.సంజీవరావ్ దంపతులు నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణలో, నేరాలను నియంత్రించడంలో జిల్లా పోలీసు శాఖ సఫలీకృతం అవ్వాలని, దుర్గామాత కరుణా కటాక్షాలు జిల్లా పోలీసులకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు నిర్వహించామని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎ.ఆర్.డీయస్పీ నరేందర్, ఆర్.ఐ.లు రామరావ్, రాజశేఖర్ రెడ్డి, ఎ.ఆర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్ ఫోర్స్ విశ్రాంతి ఉద్యోగికి సత్కారం



నవతెలంగాణ-సంగారెడ్డి

భారతీయ ఎయిర్ ఫోర్స్ దినోత్సవం, ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అమీన్‌పూర్ రెండు క్లబ్‌లు ఎయిర్ ఫోర్స్‌లో 20 ఏండ్లు సేవ చేసిన విశ్రాంత ఉద్యోగులు చంద్రయ్యను సత్కరించాయి. ట్విన్నింగ్ ప్రోగ్రామ్స్ క్రింద చందానగర్‌లోని జవహర్ నగర్‌లో ఉంటున్న చంద్రయ్య సేవలను కొనియాడి, శాలువ, పూలమాలతో క్లబ్ అధ్యక్షులు లయన్ బుల్కాపురం కృష్ణాగౌడ్ సన్మానించారు. ఈ సందర్భంగా జోన్ చైర్మెన్ లయన్ మంగళపర్తి వెంకటేశం మాట్లాడుతూ దేశ సేవలో తరించిన ఎయిర్ ఫోర్స్ విశ్రాంత ఉద్యోగిని సత్కరించడం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మెన్ పట్నం సురేందర్, ఉపాధ్యక్షులు పి. రామనర్సింహా రెడ్డి, బోర్డ్ డైరెక్టర్ పి.ఆంజనేయులు సభ్యులు, జి. లింగం, పి.నాగభూషణం, యం.క్రిష్ణా గౌడ్, సి ఎచ్. వెంకటేశం, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు



నవతెలంగాణ-మనూర్

నాగలిగిద్దా మనూర్ మండలాల పరిధి గ్రామాలలో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలు చేశారు. మహిళలు అందరు ఒక దగ్గర కలిసి సంప్రదాయ పద్ధతిలో పాటలు పడుతూ సంతోషంతో పండుగను చేసుకున్నారు. గత వారం రోజులుగా వివిధ రకాలుగా బతుకమ్మ ఆడారు. చివరి రోజు గ్రామంలోని ప్రతి చిన్న, పెద్దలు అందరు కలిసి ఆనందంగా కొలాటలు, అట పాటలతో నిర్వహించారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట పట్టణంలోని పబ్బతి హనుమాన్ వద్ద సిరి, స్నేహ యూత్, క్లాక్‌టవర్ వద్ద రుద్రసేన యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గా భవాని మండపాల వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో మాజీ ఎంపీ బీబీ పాటిల్ పాల్గొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండపాల నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. ప్రభాకర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ పులుగు గోపాలరావు, బిజెపి నాయకులు జే.ప్రభాత్ కుమార్, జగదీశ్వర్, రవిశంకర్, శివచందర్, గాజుల అనీల్, వెంకటేశం, రాజు, సిరియూత్, స్నేహ యూత్, రుద్రసేన సభ్యులు రాజా గౌడ్, ముద్దు కృష్ణ, డిబి. సతీష్, మహేష్, శివ, పవన్, మదారి సంతు, భాను, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

- అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ-ఝరాసంగం

ప్రకృతిని ఆరాధిస్తూ పుడమి తల్లి గొప్పదనాన్ని కీర్తిస్తూ మురిసిపోయే క్షణాలకు వేదిక బతుకమ్మ వేడుక. తెలంగాణ సంస్కృతి అస్తిత్వానికి సాంప్రదాయాలకు ప్రతిరూపంగా భావించే బతుకమ్మ సంబరాలు తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తారు. ప్రతి ఏటా బతుకమ్మ సంబరాలు పెతర అమావాస్య రోజున ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై.. సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. ఝరాసంగంతో పాటు మండల పరిధిలోని ఎల్గోయి, కుప్పానగర్, మాచ్నూర్, బర్దీపూర్, క్రిష్ణాపూర్, గుంత మర్పల్లి, జీర్లపల్లి, తదితర గ్రామాలలో గురువారం సాయంత్రం సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. వివిధ రంగుల పూలతో బతుకమ్మను అలంకరించి, ఆయా గ్రామాలలో మహిళలు, యువతులు నూతన వస్త్రాలను ధరించి ఆటపాటల మధ్య బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. గ్రామాలకు సమీపంలో గల చెరువులు, కుంటల వద్దకు వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు చేసి నీటిలో వదిలారు.

దుర్గ భవాని ఉత్సవాలకు పదివేల విరాళం



నవతెలంగాణ- జిన్నారం

మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన మా దుర్గాభవాని ఉత్సవాల నేపథ్యంలో మాదారం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ సరిత సురేందర్ గౌడ్ రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపి సరిత సురేందర్ గౌడ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ సస్యశ్యామలంతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ భరత్ బృందం మాదారం గ్రామస్తులు, పాల్గొన్నారు.

దుర్గా భవాని యూత్ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-రామచంద్రాపురం

పట్టణంలోని మల్లికార్జున్ నగర్ కాలనీ దుర్గా భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 18వ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, కాలనీ వాసులందరూ పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతి నగర్ రామచంద్రాపురం కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, ఈఓపిఆర్డి రాజ్ కుమార్ కాలనీ, అధ్యక్షులు రఘురాంరెడ్డి, విట్టల్, బాల్ రెడ్డి, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

సామూహిక మరుగుదొడ్లు ఏవి?

- ఆత్మగౌరవ సమస్యతో ఇబ్బందులు
- రద్దీ ప్రదేశాల్లో మరుగుదొడ్లు కరువు
- అత్యవసరాలకు ఊపిరిబిగపట్టుకునే దుస్థితి
- సామాజిక సమస్యపై ప్రత్యేక శ్రద్ధ ఏది?



నవతెలంగాణ-ఝరాసంగం

మండల కేంద్రంలో ఒకే ప్రాంగణంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంతో పాటు, రెవెన్యూ, ఐకెపి, పంచాయతీరాజ్ సబ్ డివిజన్, ఎన్ఆర్ఈజీఎస్, విద్యుత్ సబ్‌స్టేషన్, మండల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం, గ్రంథాలయ శాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాలకు ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు వందల సంఖ్యలో ప్రజలు వివిధ పనులరీత్యా వస్తుంటారు. నగరాలు, పట్టణాల నుంచి నిత్యం వచ్చే ప్రజలకు ఎదురయ్యే ఆత్మగౌరవ సమస్యకు అధికారులుగాని, ప్రజాప్రతినిధులుగాని పరిష్కారించే దిశగా ఆలోచన చేయడం లేదు. ఆడ, మగ తేడా లేకుండా అత్యవసరాలకు సౌకర్యాలు లేక పడుతున్న ఇబ్బందులను గుర్తించి జనావాసాల్లో ప్రజల రద్దీకి తగ్గట్లుగా మరుగుదొడ్లు, మూత్రశాలలను నిర్మించడం లేదు. సామాజిక సమస్యగా ఏండ్లుగా మూలనపడ్డ ఇబ్బందులను గుర్తించి, ప్రత్యేకంగా నిధులు కేటాయించి నిర్మాణాలను చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రెవెన్యూలో కనీస వసతులు కరువు..

మండల వ్యాప్తంగా ఉన్న 33 గ్రామ పంచాయతీల నుంచి నిత్యం కనీసం 20 రిజిస్ట్రేషన్లు తగ్గకుండా అవుతుంటాయి. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు 5 మంది చొప్పున లెక్కలేసుకున్నా రెవెన్యూ కార్యాలయానికే ప్రతిరోజు 100 మంది ప్రజలు వస్తుంటారు. ఈ లెక్కన చూస్తే వంద మందికి కనీస అవసరాలైన త్రాగునీరు, కూర్చునేందుకు కుర్చీలు కల్పించాల్సిన బాధ్యత కార్యాలయాధికారులపై ఉంటుంది. కానీ ఇలాంటి సౌకర్యాలు కార్యాలయంలో కనిపించడం లేదు. కేవలం ప్రభుత్వానికి రెవెన్యూ వస్తుందా..లేదా అనే ఆలోచనలో ఉన్నారే తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదు. కనీసం ఒకటి, రెండు అవసరాలను తీర్చుకునేందుకు కూడా సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సముదాయ ప్రాంగణంలో ఏదైనా సమావేశాలు నిర్వహించాలన్నా పార్కింగ్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. అంతేకాకుండా ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో నిండిపోయి ఉండడంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది పరిసర ప్రాంతాలలో కనీసం నిలబడలేని పరిస్థితులు నెలకొంటున్నాయి.

జనాభాకనుగుణంగా..మూత్రశాలలు కరువు

2011 జనాభాను అనుసరించి 34 రెవెన్యూ గ్రామాలలో 44,538 జనాభా ఉంది. ఇందులో స్త్రీలు 21852, పురుషులు 22731 ఉన్నారు. కమ్యూనిటీ టాయిలెట్లను జనాభా రద్దీ ప్రదేశాలలో నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మండలంలో వివిధ గ్రామాలలో ప్రతివారం సంతలు కొనసాగుతున్నాయి. సంతలకు వచ్చే చిరు వ్యాపారులు రైతులు సామూహిక మరుగుదొడ్లు లేక అలాగే బిగిసిపట్టుకుని తీవ్ర సమస్యతో బాధపడుతున్నారు. ఇక మహిళల పరిస్థితి వర్ణనాతీతం. మహిళల కోసం ప్రత్యేకంగా షీ టాయిలెట్లను ప్రభుత్వం నిర్మించాలని కోరుతున్నారు. కమ్యూనిటీ టాయిలెట్‌లో మహిళలకు ప్రత్యేకంగా నిర్మించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పబ్లిక్ టాయిలెట్లను నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించి, జన బాహుళ్య ప్రదేశాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లోనే పబ్లిక్ టాయిలెట్లను ప్రభుత్వం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏళ్ల తరబడిగా బస్సులు లేక గ్రామస్థుల అవస్థలు

- బస్సులు లేవు-అవస్థలు తీరవు
- జనం గగ్గోలు ఎవరికి పట్టదా?

నవతెలంగాణ-జిన్నారం

మావి పల్లెటూళ్ళు... మా గ్రామాలకు బస్సులు లేకున్నా మమ్మల్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఏళ్ల తరబడిగా బస్సుల కోసం తాము పడుతున్న అవస్థలు ఇన్ని అన్ని కావు... అంటూ జిన్నారం మండలానికి చెందిన పలు గ్రామాల ప్రజలు దీనంగా వాపోతున్నారు. కాయ కష్టం చేసుకునేందుకుకై కూలీ పనులకైనా మరే ఇతరత్రా పనుల నిమిత్తమై తాము ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే బస్సులు లేక తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందంటూ రోజువారి కూలీలకు వెళ్లే జనాలు లబోదిబోమంటున్నారు. జిన్నారం మండల పరిధిలోని ఊట్ల, మంగంపేట, దాది గూడెం సో లక్ పల్లి, శివానగర్, జిన్నారం, లక్ష్మీపతి గూడెం, వావిలాల, గడ్డపోతారం చెట్ల పోతారం, కిష్టయ్యపల్లి, అలీ నగర్, కొడకంచి మాదారం, పుట్టగూడ, అండూర్, మిజాజి గూడెం, జగంపేట, చౌదరి గూడెం, నల్తూరు, కొర్లకుంట, మంత్రి కుంట తదితర గ్రామాల పరిస్థితి సరైన బస్సు సౌకర్యం లేక తీవ్రమైన ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందంటూ ఆయా గ్రామాల ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అండూర్ లాంటి గ్రామానికి గతంలో సికింద్రాబాద్ బాలానగర్ మీదుగా జీడిమెట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బొంతపల్లి కమాన్ జిన్నారం మీదుగా అండూర్ వరకు కొనసాగిన సందర్భంలో చాలా సౌకర్యవంతమైన ఆర్టీసీ బస్సు సదుపాయం ఉండేదని అండూర్ గ్రామస్తులు గుర్తు చేశారు. కాగా సదరు బస్సు బంద్జై అనేక సంవత్సరాలు గడుస్తున్నా తమ గ్రామం ఎర్ర బస్సు అంటే ఏంటో ఎరుగని పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందంటూ పలువురు గ్రామస్తులు దీనంగా వాపోయారు. అలాగే శివానగర్ కొడకంచి మీదుగా పటాన్చెరువు నుంచి బొంతపల్లి వీరభద్ర స్వామి దేవాలయం, బొంతపల్లి కమాన్ వరకు ప్రత్యేకంగా రెండు రూట్లలో బీహెచ్ఈఎల్ బస్సులు కొన్ని ఏళ్ల తరబడిగా ప్రజా సౌకర్యవంతంగా నడవడంతో శివానగర్, సోలక్పల్లి, రాళ్లకత్వ దాది గూడెం, ఉట్ల, జిన్నారం, బొంతపల్లి వీరభద్ర స్వామి దేవాలయం, బొంతపల్లి కమాన్, మాదారం కిష్టారెడ్డిపేట్, జానకంపేట వడిగేపల్లి, బొమ్మనకుంట, మాదారం, కొడకంచి, పుట్టగూడా, జిన్నారం బొంతపల్లి వీరభద్ర స్వామి దేవాలయం, బొంతపల్లి కమాన్ వరకు ఆర్టీసీ బస్సులు నడిచిన సందర్భంలో ఆయా గ్రామాల వారికి చాలా సౌకర్యవంతంగా ఉండేదని జిన్నారం పరిసర గ్రామాల ప్రజలు గుర్తు చేస్తున్నారు. జీడిమెట్ల డిపోకు సంబంధించిన ఆర్టీసీ బస్సులు బాలానగర్ సికింద్రాబాద్ మీదుగా మండల కేంద్రమైన జిన్నారం వరకు చాలా సౌకర్యవంతంగా గతంలో నడిచాయని ప్రస్తుతం మొక్కుబడిగా ఒకటి అర నడుస్తుండడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందంటూ ప్రయాణీకులు వాపోతున్నారు. నర్సాపూర్ డిపోకు సంబంధించి బస్సులు ఇటీవల కాలంలో ఏదో మొక్కుబడిగా నడవడం అది కూడా మధ్యలోనే బంద్ కావడం జరిగిన సందర్భాలు ఉన్నాయంటూ సో లక్ పల్లి నాగారం, ఇమామ్ నగర్, షేర్ ఖాన్ పల్లి, రొయ్యపల్లి, మంగంపేట, రాళ్లకత్వ శివానగర్ తదితర గ్రామాలకు చెందిన ప్రయాణీకులు వాపోయారు. తమ తమ గ్రామాలకు బస్సు ట్రిప్పులను పెంచాలని అసలే బస్సులు నడవని గ్రామాలకు నూతనంగా బస్సులు వేయాలని నర్సాపూర్ హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్టాండ్ నరసాపూర్ ముందు బైఠాయింపు ధర్నా కార్యక్రమాలను కూడా చేపట్టి నర్సాపూర్ డిపో ఆర్టీసీ అధికారులకు పూర్తిస్థాయిలో బస్సు సౌకర్యం కల్పించి అదనపు ట్రిప్పులను పెంచాలని కూడా విజ్ఞాపన పత్రాలు అందించినట్లు ఆయా గ్రామాల ప్రజలు ప్రయాణికులు తెలిపారు.

విద్యార్థులు పడే అవస్థలు వర్ణనాతీతం

జిన్నారం పరిసర గ్రామాలకు చెందిన ప్రజలకు సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల నుంచి హైదరాబాద్ సికింద్రాబాద్ లాంటి ప్రాంతాలకు డిగ్రీ జూనియర్ కళాశాలలకు ఇతరత్రా వృత్తి విద్యా విద్యలకు సంబంధించి రకరకాల కోర్సులు చదివే విద్యార్థులు ప్రతినిత్యం ఆయా కళాశాలకు వెళ్లాలంటే సరైన బస్సులు లేకపోవడంతో విద్యార్థులు పడే అవస్థలు వర్ణాతీతంగా



మారాయంటూ పలువురు దీనంగా వాపోతున్నారు. అంతెందుకు మండల కేంద్రమైన జిన్నారంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు రోజువారి కళాశాలకు సమీప గ్రామాల నుంచి రావాలన్నా పూర్తిస్థాయిలో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడం వారి పాలిట శాపంగా మారిందంటూ ఆయా గ్రామాల వారు తెలిపారు. ప్రస్తుతం గాగిల్లాపూర్ నుంచి జిన్నారం వరకు కళాశాల విద్యార్థులను ప్రతి రోజు తీసుకొచ్చేందుకు ప్రత్యేకంగా ఓ బస్సు సౌకర్యం ఉన్నప్పటికీ అది కాస్త మిస్ అయితే తమ పరిస్థితి ఏంటని ఆయా గ్రామాల విద్యార్థుల సంబంధీకులు వాపోతున్నారు.

రోజువారి పనులకు వెళ్లలేకపోతున్నాం

ఆంజనేయులు, ఊట్ల గ్రామస్తుడు



మా గ్రామానికి బస్సులు రాకపోవడం గతంలో ఉన్న బస్సులు బంద్ కావడం వివిధ రోజువారి పనులు కూలీ నాలీ చేసుకునే జనాలు ప్రతిరోజు తమ గ్రామం నుంచి ఉపాధి కోసం బయటకు వెళ్లాలంటే నరకం చూస్తున్నామంటూ ఊట్ల గ్రామానికి చెందిన ఆంజనేయులు దీనంగా వాపోయారు.

ఎస్‌హెచ్‌ఓ, రైటర్ పోస్టుల నియామకంలో జాప్యం

నవతెలంగాణ-వట్‌పల్లి

వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో రెగ్యులర్ ఎస్‌హెచ్‌ఓ, రైటర్ పోస్టులను భర్తీ చేయడంలో అధికారులు జాప్యం చేయడం పట్ల ఫిర్యాదుదారులు, మండల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు, జూన్ కంటే ముందు ఎస్సైగా విధులు నిర్వహించిన కోటేశ్వరరావు పై చదువుల నిమిత్తం దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో కే సంగమేశ్వర్ ఎస్ఐగా బదిలీపై వచ్చి నెల రోజులు తిరగకుండానే ఇక్కడి నుంచి బదిలి చేయించుకొని వెళ్ళిపోయారు. దాంతో సంగారెడ్డి ఎస్‌బిలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై లక్ష్మణ్‌ను వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై పంపించారు. కాలం కలిసి రాక ఆయన దురదృష్టమేమో కానీ ఆయన బర్త్ డే వేడుకలు ఆయనకు శాపంగా మారాయి. అనుకున్నది ఒకటి జరిగింది మరొకటి ఎవరి దగ్గర లంచం తీసుకున్నది కాదు ఎవరిపై తప్పుడు కేసులు నమోదు చేసింది అంతకంటే కాదు కేవలం వ్యక్తిపై ఉన్న అభిమానంతో సదుద్దేశ్యంతో బర్త్‌డే శుభాకాంక్షలు చెప్పడమే పెద్ద నేరమైపోయింది. దాంతో అధికారులు ఆయనను ఇక్కడి నుంచి తప్పించి హైదరాబాద్ పంపించారు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏఎస్ఐ విట్టల్‌కు ఇన్చార్జి ఎస్సైగా అదనపు బాధ్యతలు అప్పగించారు, ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న విట్టల్ ఎస్సైగా అదనపు బాధ్యతలతో ఇబ్బందులు పడక తప్పడం లేదు. వారం రోజుల క్రితం ఆస్పత్రి పని నిమిత్తం సెలవులో వెళ్ళగా జోగిపేట పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ గౌస్‌ను వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తాత్కాలిక ఏఎస్ఐ గా పంపగా స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులను పలకరించిన దాఖలాలు లేవు. సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో కూడా అంతు పట్టడం లేదని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిచారు. ఫిర్యాదుదారులు సమస్యలపై ఇచ్చిన దరఖాస్తులను కేసులు నమోదు చేయాలంటే స్టేషన్లో రైటర్ ఉండాల్సిందే కానీ స్టేషన్లో ఉన్న ఇద్దరు రైటర్లలో ఒక రైటర్ నరసింహులను ముందుగానే ఆరు నెలల క్రితమే జోగిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయానికి బదిలీపై



పంపారు, ఉన్న ఒక రైటర్ ప్రతాప్‌ను నెల రోజుల క్రితం ఒకానొక అనాలోచిత ఆవేశ ఆవేశపూరితమైన వాట్సాప్ పోస్టు పెట్టడంతో జిల్లా కార్యాలయానికి అటాచ్ చేశారు. దీంతో నెల రోజులు గడచినా ఒక్క ఫిర్యాదు కూడా పోలీసులు తీసుకొని కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు, జన్మదిన శుభాకాంక్షలు స్టేషన్లో నిర్వహించడంపై తప్పు పట్టిన ఉన్నతాధికారులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ లక్ష్మణ్‌ను ఐ జి సత్యనారాయణ బదిలి వేటు వేసి హైదరాబాద్ ఐజి కార్యాలయానికి అటాచ్ చేశారు. అప్పటి నుండి ఇప్పటివరకు ఎస్సై పోస్టు రైటర్ పోస్టులు భర్తీ చేయడంలో అధికారులు జాప్యం చేస్తుండడంపై బడుగు బలహీన వర్గాలు, సామాన్య ప్రజలు , పేదలు ఇబ్బందుల పాలవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్న సిబ్బందిలో కొందరు డిప్యూటేషన్లలో వెళ్ళగా ఉన్న ముగ్గురు నలుగురు రాత్రి సమయాలలో పెట్రోలింగ్ చేయడంలో అలసట లేని విధులను నిర్వహిస్తున్నారు. ఎస్ఐ పోస్టును భర్తీ చేసి రైటర్‌ను నియమించాలని పలువురు కోరుతున్నారు.

బాబా నగర్‌లో సంచరిస్తుంది ఎలుగుబంటి.. కొండముచ్చు అయి ఉండవచ్చు

- ఎఫ్ఆర్ఓ దేవిలాల్

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణ పరిధిలోని రంజాన్ బాబా నగర్‌లో వ్యవసాయ పొలాల్లో సంచరిస్తున్నది ఎలుగుబంటి, కొండముచ్చు అయి ఉండవచ్చని ఎఫ్ఆర్ఓ దేవిలాల్ తెలిపారు. గురువారం జహీరాబాద్ మునిసిపల్ పరిధిలోని రంజోల్ బాబా నగర్‌లో మొల్ల అఫ్జల్ మియా పొలంలో వన్యమృగ పాదముద్రలను గుర్తించి స్థానిక వ్యవసాయ విస్తరణాధికారి ప్రదీప్ కుమార్‌కి తెలపగా తాను వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం చేరవేసి సిబ్బందితో ఆ క్షేత్రాన్ని సందర్శించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కృష్ణమ్మ, బీట్ ఆఫీసర్ సంతోషి, భాస్కర్ సంజీవ్ తుకారంలు ఆ పాదముద్రలను పరిశీలించి ఎలుగుబంటి పాదముద్రలుగా అనుమానిస్తున్నామని, ఈ విషయాన్ని పై అధికారులకు తెలిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు. అంతవరకు వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు కూలీలు జాగ్రత్తగా ఉండాలని ఎవరికైనా కనిపించినచో వెంటనే అటవి శాఖ సిబ్బందికి తెలియచేయాలని కోరారు. ఎలుగుబంటి లేదా కొండముచ్చు కోతి పాదాలు కూడా అదే విధంగా



ఉంటాయన్నారు. భయపడాల్సిన అవసరం లేదని జాగ్రత్తగా ఉండాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కృష్ణమ్మ బీట్ ఆఫీసర్లు సంతోషి, భాస్కర్, సంజీవ్, తుకారాం రైతులు అఫ్జల్మియా, రవికుమార్, బాల్ రామ్, పాషా మియా తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మెదక్
3
శుక్రవారం | 11 అక్టోబర్ 2024 | www.navatelangana.com

పండగ పూట కన్నీటి కష్టాలు

నవతెలంగాణ-పాపన్నపేట

బతుకమ్మ పండగ రోజు కడివెడు నీటి కోసం మహిళలు కన్నీటి కష్టాలు పడుతున్నారు. మండల కేంద్రమైన పాపన్నపేటలోని నీళ్ల గౌని వద్ద సింగిల్ ఫేజ్ మోటార్ చెడిపోయి మూడు రోజులు కావస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు వాపోతున్నారు. మోటర్‌ను బయటకు తీసి అలాగే వదిలేశారని చెప్పారు. దగ్గరలో నీరు లేక పోవడంతో పండుగ నాడు నానా తంటాలు వడాల్సి వస్తుందని వాపోయారు. ముఖ్యంగా పట్టణాలకు పోయి పండగకు ఇంటికి వచ్చిన వారు నీటి బొట్టు కోసం పాట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు.



భూముల సర్వే చేయాలని వినతి

నవతెలంగాణ-న్యాల్‌కల్



రాజోల గ్రామంలో 100, 101 సర్వే నెంబర్ల భూములను సర్వే చేసి న్యాయం చేయాలని గురువారం తహశీల్దార్ భూపాల్‌కు రాజోల గ్రామ రైతులు ఫిర్యాదు చేశారు. గా(గ్రామంలోని భూముల వివాదంపై తహశీల్దార్ భూపాల్‌ను వివరణ కోరగా త్వరలో సర్వే చేసి రైతులకు న్యాయం చేస్తామన్నారు శాంతియుత వాతావరణంలో పరిష్కరించుకోవాలన్నారు. గురువారం రాజోల గ్రామంలో భూముల విషయంలో రైతుల భూములకు వెళ్లే దారికి అడ్డంగా రాళ్ల వేయడంతో గొడవలు తలెత్తాయి. విషయం తెలిసిన వెంటనే హద్నూర్ ఎస్సై రాము నాయుడు, మండల గిర్దావర్ శ్యామ్ రావు అట్టి భూముల స్థలాన్ని పరిశీలించారు.ఈ మేరకు ఇరువర్గాలకు చెందిన వారిపై కేసు నమోదు చేసి పలువురిని తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్నట్లు ఎస్సై రామునాయుడు తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

నవతెలంగాణ-సంగారెడ్డి



సరళీకృత చెల్లింపు పథకం (ఎల్‌ఆర్‌ఎస్) ద్వారా భూములు క్రమ బద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్ అన్నారు. సరళీకృత చెల్లింపు పథకం (ఎల్ ఆర్ ఎస్) ద్వారా భూములు క్రమబద్ధీకరణపై చేపట్టాల్సిన విధి విధానాలను మున్సిపల్ పరిధిలోని మున్సిపల్ అధికారులు, రెవిన్యూ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రెవిన్యూ, ఇరిగేషన్, టౌన్ ప్లానిం గ్, శాఖల సమన్వయంతో ఎల్ ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని మున్సిపల్ పరిధిలోని అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టాలన్నారు. క్రమబద్ధీకరణ క్రమంలో తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, రెవిన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మూర్చతో గుర్తుతెలియని మహిళ మృతి

నవతెలంగాణ-పటాన్‌చెరు



మూర్చ రావడంతో ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పటాన్‌చెరు పట్టణంలోని జాతీయ రహదారి ఇండియన్ పెట్రోల్ బంక్ పక్కన సయ్యద్ మెకానిక్ డబ్బా వెనకాల సుమారు 40 సంవత్సరాల గుర్తుతెలియని మహిళ మూర్చ రావడంతో నోట్లో నుండి నురగ వచ్చి పడి ఉన్నది. ఆమెను చూసిన మెకానిక్ డబ్బా సిబ్బంది శివ, సయ్యద్‌లు హుటా హుటిన 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆ మహిళ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి కుడి చేతిపై గంగా అని రాసి ఉంది. మృతి చెందిన మహిళను ఎవరైనా గుర్తు పట్టినట్లయితే (8712756756, 8712756724) పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ నెంబర్‌కు తెలియజేయాలని కోరారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ పండుగ ఉత్సవాలు



నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో సద్దుల బతుకమ్మ ఉత్సవాలను అంగరంగ వైభవంగా గురువారం మహిళలు ఆనందోత్సవాలలో నిర్వహించారు. డీజే బతుకమ్మ పాటలు పలు గ్రామాలలో తగ్గించి మహిళలే బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ అంటే సామాన్య ప్రజలకు మహిళలకు అర్థమయ్యే రీతిలో బంగారి బతుకమ్మ పోయిరావమ్మ సామాన్యుల బ్రతుకుల్లో వెలుగునివ్వమ్మా అంటూ పాటలు పాడుతూ ఆనందోత్సవాలతో కోలాటలు తదితర పాటలు పాడుతూ సద్దుల బతుకమ్మను సాగనంపారు. కార్యక్రమంలో ఆయా పార్టీల మాజీ ప్రజా ప్రతినిధులు మహిళలు చిన్నారులు చిందులు వేస్తూ సంతోషాన్ని వ్యక్తం చేశారు

నవతెలంగాణ-జిన్నారం



మండల కేంద్రమైన జిన్నారంలో గురువారం అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలను అత్యంత భక్తిశ్రద్ధల మధ్య సాంప్రదాయ బద్ధంగా ఆనందోత్సవాల మధ్య ఘనంగా నిర్వహించారు. స్థానికంగా కోదండ రామాలయం ప్రాంగణంలోకి జిన్నారం, పెద్దమ్మ గూడెం, నరిగూడెం గ్రామాల నుంచి ఆడపడుచులు తీరొక్క పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో భారీగా అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన బతుకమ్మలను రామాలయం ప్రాంగణం ముందు పెట్టి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాల పాటలతో సంబరాలు చిన్న పెద్దల మధ్య సందడిగా నెలకొంది. అంతకుముందు తమ ఇళ్లల్లో వాడల్లో అందంగా అలంకరించిన బతుకమ్మలకు పూజలు నిర్వహించి ఇరుగుపొరుగుతో కలిసి బతుకమ్మ ఆట పాటలతో సందడి చేశారు. అనంతరం స్థానికంగా గల అక్కమ్మచెరువులో బతుకమ్మలను వేసి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించి మళ్లొచ్చే బతుకమ్మ పండుగకు తొందరగా రావమ్మ అంటూ బతుకమ్మలను అలాగే మండల పరిధిలోని మంగంపేట, జంగంపేట, లక్ష్మీపతి గూడెం వావిలాల చౌదరి గూడెం, నల్తూరు, కొర్లకుంట, మంత్రి కుంట, మాదారం కొడకంచి, శివానగర్, సోలక్ పల్లి, రాళ్ల కత్వ, రాళ్లకత్వ తాండ, దాది గూడెం ఊట్ల, కాజిపల్లి, గడ్డపోతారం,చెట్ల పోతారం అలీనగర్, కిష్టయ్యపల్లి, తో పాటుగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

నవ తెలంగాణ-చౌటకూర్



చౌటకూర్ మండలంలో ఊరూరా చివరి రోజైన సద్దుల బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, పిల్లలు పాటలు పాడుతూ ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న సినీ నటుడు సుమన్

నవతెలంగాణ-వెల్దుర్తి



నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం మండల పరిధి మన్నె వారి జలాల్పూర్ గ్రామం కాళికామాత భక్తులకు దుర్గామాత దర్శనం ఇచ్చారు. ముఖ్యఅతిథిగా సినీ నటుడు సుమన్ అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు సర్వ మతాలకతీతంగా కాళికామాత దుష్ట శిక్షణ శిష్ట రక్షణ చేసి ప్రజలందరినీ సుఖ సంతోషాలతో నింపారన్నారు. కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, గ్రంధాల చైర్పర్సన్ వాసిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. ఆలయ నిర్వాహకులు శాలువు లతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో భజన భక్తులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

- వేడుకల్లో పాల్గొన్న జిల్లా ఎస్.పి.డి.ఉదయ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్



తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయం ఆవరణంలో ఎస్పీ సతీమణి అరుణ, జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్. ఎస్. మహేందర్, మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు కుటుంబ సభ్యులతో బతుకమ్మ ఆడటం ఆనందంగా ఉందని తెలిపారు. బతుకమ్మ బతుకుని కొలిచే పండుగ. ఎక్కడైనా దేవుళ్లకు పూలు పెట్టి కొలుస్తాము, పువ్వులనే దేవతగా కొలిచే సాంప్రదాయం మన తెలంగాణలో ఉందన్నారు. తెలంగాణ సంస్కృతికి చారిత్రక చిహ్నం బతకమ్మని, తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం, చరిత్ర, పురాణాలు మేళవిస్తారు. ఈ పాటలు చాలా వినసొంపుగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మ పండుగ. తెలంగాణ నేలపై బతుకమ్మ పండుగను శతాబ్దాలుగా నిర్వహిస్తున్నారని తెలిపారు. పూలను పూజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ నిర్వహించుకునే పండుగ బతుకమ్మను అత్యంత వైభవంగా చేసుకోవాలన్నారు. ప్రకృతితో మమేకమయ్యే పండుగ బతుకమ్మ అని కొనియాడారు. పోలీస్ శాఖలో నిరంతరం విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందించే పోలీసు అధికారులు సిబ్బంది కుటుంబాలతో కలిసి నవరాత్రులలో భాగంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాలకు హాజరుకావడం ఆనందకరంగా ఉందని తెలిపారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి ఈ పూల పండగను ఎంతో అందంగా ఏర్పాటు చేసిన పోలీసు అధికారులను ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం బతుకమ్మ పాటలకు నృత్యాలు చేస్తూ మహిళలు, పిల్లలు ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, ఎఆర్ డిఎస్పీ రంగ నాయక్, సూపరింటెండెంట్ మణి, అల్లాదుర్గం సిఐ రేణుక రెడ్డి , ఆర్.ఐ.శైలేందర్, ఎఆర్ ఎస్.ఐ నరేష్, మహిపాల్ పాటు జిల్లా పోలీస్ ప్రదాన కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఆరోపణలు నిజమైతే శాఖాపరమైన చర్యలు

- పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డిఎస్పి

నవతెలంగాణ-చిలిపిచేడ్



చిలిపిచెడు పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ సుధారాణి బుధవారం ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయం విధితమే....ఎస్సై మానసికంగా వేదిస్తున్నాడని వచ్చిన ఆరోపణలు నిజమైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డి అన్నారు. ఎస్సై మానసికంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఏఎస్ఐ సుధారాణి బుధవారం రాత్రి పోలీస్ స్టేషన్లో చున్నితో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య ప్రయత్నం చేయగా కానిస్టేబుల్ చూసి రక్షించి, చికిత్స నిమిత్తం ఆమెను జోగిపేట ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్య చేసుకోవడానికి ఎస్ఐ కారణమని సూసైడ్ లెటర్ రాసుకోగా గురువారం తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డి చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్‌లో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డి, నర్సాపూర్ సిఐ జాన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఏఎస్ఐ సుధారాణి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పూర్తిగా దర్యాప్తు చేసి పై అధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. ఒకవేళ వేధింపులు నిజమైతే శాఖాపర్యమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ సిఐ జాన్ రెడ్డి, ఎస్సై యాదగిరి, ఏఎస్ఐ మిస్బావోద్దీన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

14న అందోల్‌లో అలయ్ బలయ్

- మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

నవతెలంగాణ-జోగిపేట



విజయదశమి పండుగ సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదిన అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. గురువారం సాయం త్రం అందోల్ లక్ష్మి నర్సింహ ఫంక్షన్ హల్‌లో ఏర్పాట్లను నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రతి సం వత్సరంలాగే ఈ సంవత్సరం కూడా బీఆర్ఎస్ ఆధ్వ ర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ స్పీకర్ మధుసూదనా చారి తదితర ముఖ్య నేతలు హాజరుకానునట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు పి. జైపాల్ రెడ్డి, పి.నారాయణ, లింగా గౌడ్, ఎం. విజయ్ కుమార్, డిబి నాగభూషణం, వీరారెడ్డి పట్టణ అధ్యక్షులు సార శ్రీధర్, మండల నాయకులు చాపల వెంకటేశం, బిర్ల శంకర్, మహేష్ యాదవ్, ఉస నాగరాజు, నాయికోటి అశోక్, సుధాకర్ గౌడ్, సత్యం, పాల్గొన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు













నవతెలంగాణ-మెదక్ రూరల్



మెదక్ మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. గుట్టకింది పల్లి, మక్త భూపతిపూర్, వెంకటాపూర్, కొంటూరు, రాజ్ పల్లి, చిట్యాల, మంభోజీ పల్లి, పేరూరు, మహిళలుతీరొక్క పూలతో సద్దుల బతుకమ్మను, గౌరమ్మను తెలంగాణ సాంస్కృతిక సాంప్రదాయాల అనుగుణంగా తయారుచేసి పూజలు నిర్వహించారు. వాటిని గ్రామ వివిధ కూడళ్లలో దించి పెద్ద బతుకమ్మ, గౌరమ్మలా చుట్టూ పాటలతో ఆటలాడుతూ ఆనందంగా గడిపారు. తరువాత గ్రామ శివారులోని చెరువుల, కుంటలలో పెద్ద బతుకమ్మలను, గౌరమ్మలను పోయిరా బతుకమ్మ అని గంగమ్మ తల్లి ఒల్లోకి వదిలినారు. నీకు తోడుగా తెచ్చుకున్న సద్దిబువ్వ, పుంటికూర, పెరుగు కలిపిన బువ్వను చెరువు, కుంటల గట్టులపై మహిళా మణులు కూర్చొని ఆరగించారు.

నవతెలంగాణ-పాపన్నపేట

సద్దుల బతుకమ్మ వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలో మహిళలు పెద్ద బతుకమ్మలను రకరకాల పూలతో బతుకమ్మలను పేర్చి చెరువుల వద్దకు తీసుకొనివచ్చారు. గ్రామాలలోని ప్రధాన కూడలిలో దేవాలయాల వద్ద బతుకమ్మలను తీసుకొని వచ్చి ఒక దగ్గర ఉంచి బతుకమ్మ ఆటలాడారు. డీజే సౌండ్ల మధ్యన మహిళలు పాల్గొని బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం గ్రామంలోని చెరువుల వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాల్లో గ్రామంలోని అందరూ చిన్న పెద్ద తారతమ్యం లేకుండా పాల్గొన్నారు.

నవతెలంగాణ-వెల్దుర్తి

తెలంగాణ సాంస్కృతికి అద్దం పట్టే విధంగా ఉమ్మడి మాసాయిపేట్ వెల్దుర్తి మండలాల్లో వివిధ రకాల పూలతో బతుకమ్మల పేర్చి చిన్న, పెద్ద మహిళలతో గురువారం సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధుల్లో ఆటపాటలతో సంబరాలు నిర్వహించుకున్నారు. తెలంగాణ పాటలతో గ్రామ గ్రామాన సందడిగా నెలకొంది. అనంతరం బతుకమ్మలను చెరువులలో నిమజ్జనం చేశారు. ఈ పండుగ మహిళలకు ఎంతో సంబరాన్ని చేకూర్చింది, చెరువు గట్ల పైన వివిధ రకాల వంటలతో సద్దులతో ఒకరినొకరికి ఆప్యాయంగా పంచుకొని భోజనం చేశారు.

నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద సద్దుల బతుకమ్మను మహిళలు ఘనంగా నిర్వహించారు. మల్లచ్చే పండుగకు మా ఇంటికి రావమ్మ అంటూ ఆటపాటలతో బతుకమ్మ బతుకమ్మ బంగారు బతుకమ్మ అంటూ పాటలు పాడుతూ ఆనందంతో ఆటలాడుతూ బతుకమ్మను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సుగుణమ్మ, శోభ రాణి, చెరివిరాల శోభ, మంగమ్మ, పప్పుల లహరి, పప్పుల భవాని, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని హద్నూర్, మ్మరుజాపూర్, చీకుర్తి , రేజింతల్, పలు గ్రామాల్లో మహిళలు చిన్నారులు కోలాటలతో ఆటపాటలతో సద్దుల బతుకమ్మ పండుగ సంబరాలు నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చారు. బతుకమ్మ పండుగ సందర్భంగా బతుకమ్మ ఆటపాటలతో గ్రామాల్లో ఆటపాటలతో ఆకట్టుకున్నాయి. హద్నూర్‌లో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాల్లో ఉప తహశీల్దార్ రాజిరెడ్డి, ఎంపీడీవో రాజశేఖర్, ఎంపిఓ సురేష్, పంచాయతీ కార్యదర్శి ధనరాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు పడాలపల్లి గ్రామంలో కౌన్సిలర్ పొంది అరుణ వెంకట్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అంగరంగ వైభవంగా చివరి రోజు అయిన సద్దుల బతుకమ్మ వేడుకలను గ్రామ ప్రజలు మహిళలు ఉత్సాహంగా ఉల్లాసంగా బతుకమ్మ పండుగను చేసుకున్నారు. ప్రకృతిని పూజించే పండుగ బతుకమ్మ పండుగ అని, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను పుట్టిపడేలా, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా సంప్రదాయాలను తెలియజేస్తూ, అంగరంగ వైభవంగా, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చిన మహిళలు, ఎంతో ఆనందంతో ఆటపాటలతో బతుకమ్మ సంబరాల్లో ఆడి పాడారు. మహిళలు యువతులు చిన్నారులు సంప్రదాయాలకు తగ్గట్టుగా వస్త్రాలంకరణ చేసుకొని బతుకమ్మ సంప్రదాయాలను పాటించి, బతుకమ్మ పండగ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దీపిక గౌతమ్ గౌడ్, సునీత, మానస,అంబిక, రూప, కావ్య, గ్రామ మహిళలు, పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణా-హత్నూర

సంగారెడ్డి జిల్లా హత్నూర మండల మండల వ్యాప్తంగా దౌల్తాబాద్ కాసాల మల్కాపూర్, హత్నూర దేవులపల్లి తదితర గ్రామాలలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా పూలను ప్రకృతిని ప్రేమించే ఏకైక పండుగ సద్దుల బతుకమ్మ అని కొనియారు. తెలంగాణ సాంస్కృతిక సాంప్రదాయాలకు నిలయంగా బతుకమ్మ పండుగను ఆడపడుచులందరూ నూతన వస్త్రాలు ధరించి తీరొక్క పువ్వులు పేర్చిన బతుకమ్మను ఒక చోట పెట్టి ఆటపాటలతో ఘనంగా సద్దుల బతుకమ్మ నిర్వహించారు. హత్నూర తహశీల్దార్ కార్యాలయం ఎదుట అధికారి ఫర్వీన్ షేక్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, అంగనవాడి టీచర్స్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.







ఇంటిలో మొక్కలు పెంచాలి

- మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి



నవతెలంగాణ-గజ్వేల్

ప్రతి ఇంటిలో మొక్కలు పెంచాలని, ప్రధాన రోడ్లపై కూడా వాటిని నాటి సంరక్షించు బాధ్యత అందరూ తీసుకోవాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలో తొమ్మిదో వార్డు ప్రధాన రోడ్డుపై మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..వార్డులోని ప్రజలు మొక్కలు నాటాలని కోరారు. కాలుష్యం నివారణకు మొక్కల పెంపకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పార్టీలకు అతీతంగా ఈ కార్యక్రమాలు చేయాలన్నారు. ప్రజలు ముందుకు వచ్చి మొక్కలు నాటినప్పుడు అవి పెరిగి పెద్దగా మారినప్పుడు అనేక ఫలితాలు ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మామిడి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఫసల్‌వాదిలో బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిగ్రామం మాజీ సర్పంచ్ నిర్మలాదేవి మాణిక్యం ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని ఆర్కెస్ట్రా, డీజే పాటలతో గ్రామ ఆడపడుచులు సందడి చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి పట్నం మాణిక్యం మాట్లాడుతూ తెలంగాణ ఆచార సాంప్రదాయాలకు ప్రతీక సద్దుల బతుకమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి రేషన్ కిట్ అందజేత



నవతెలంగాణ-సిద్దిపేట

బతుకమ్మ దసరా పండుగల సందర్భంగా 20వ వార్డ్‌లో సేవలు అందిస్తున్న మున్సిపల్ జవాన్, పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ లైన్ మెన్స్, మున్సిపల్ కరెంట్ లైన్ మెన్‌లకు రేషన్ కిట్‌ను కౌన్సిలర్ మొహమ్మద్ రియాజుద్దీన్ గురువారం అందజేశాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బతుకమ్మ ఆటలు ఆడుకోవడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వార్డు ప్రజలకు బతుకమ్మ, దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ, వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలుకు ఘనంగా సన్మానం



నవతెలంగాణ-గజ్వేల్

ఉపాధ్యాయ ఫలితాల్లో ఎస్‌జీటీ ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన పోలోజి కళ్యాణిని పలువురు అభినందించారు. గురువారం గజ్వేల్ పట్టణ శివాలయం బస్తీకి చెందిన వారంతా ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. బుధవారం సీఎం చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్న సందర్భంలో ఆమెను ఘనంగా సన్మానించినట్లు కేతోజి వినోద్ తెలిపారు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అని తల్లి, తండ్రి తర్వాత ప్రతి ఒక్కరి జీవితంలో గురువు పాత్ర ఎంత గొప్పదని అన్నారు. భవిష్యత్తులో మంచి అవకాశాలు కళ్యాణికి రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ శివాలయం బస్తి నివాసులు పాత రాజు, హనుమంతు, సాయి, నాగరాజు, రాములు, నరేష్, సంతోష్, శివ, మురళి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఉపసర్పంచ్ మృతి



(ఫైల్)



నవతెలంగాణ-కొండపాక

రోడ్డు ప్రమాదంలో మాజీ ఉపసర్పంచ్ మృతి చెందిన సంఘటన రాజీవ్ రహదారి లకడారం గ్రామ స్టేజి వద్ద చోటుచేసుకుంది. కుకునూరు పల్లి ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆయన రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతుండగా కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు. వెంటనే ఆయనను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయి



నవతెలంగాణ-నంగునూరు

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ ఎడ్ల సోమిరెడ్డి అన్నారు. మండలంలోని గట్ల మల్యాల గ్రామంలో బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా కీర్తిశేషులు అనుమాస్ భాస్కర్ రెడ్డి జ్ఞాపకార్థంతో క్రికెట్ టోర్నమెంట్ మెంట్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు ఓటములు సహజంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాజా, మాజీ సర్పంచ్ తిప్పని రమేశ్, బీఆర్ఎస్ నాయకులు కర్ణకంటి వేణు, వివిధ పార్టీల నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఓగా మోహన్ నాయక్ బాధ్యతలు



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం నూతన ఎంపీఓగా మోహన్ నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మధ్య కాలంలోనే అక్కన్నపేటలో ఎంఎఈవోగా పనిచేసినటువంటి కవి కుమార్ ఆకస్మికంగా మరణించారు. దీంతో నూతన ఎంపీఓగా మోహన్ నాయక్ నియమితులయ్యారు. ఆయన నూతన బాధ్యతలు స్వీకరించడంతో ఎంపీడీవో జయరాం నాయక్, కార్యదర్శులు శుభాకాంక్షలు తెలియజేశారు.

పరిస్థితి విషమించి యువకుడి మృతి

- గడ్డి మందు సేవించి ఆత్మహత్యయత్నం



(ఫైల్)

నవతెలంగాణ-బెజ్జంకి

గడ్డి మందు సేవించి యువకుడు ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. సొల్లు మేసం(30) లారీ డ్రైవర్ గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. దసరా పండుగ సందర్భంగా గత రెండు రోజుల క్రితం స్వగృహానికి వచ్చాడు. బుధవారం సాయంత్రం తోటపల్లి ఆన్ లైన్ రిజర్వాయర్ ఆనకట్టపై గడ్డి మందు సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు మేరుగైన చికిత్స కోసం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి 108 అంబులెన్స్ యందు తరలించారు. పరిస్థితి విషమించి గురువారం చికిత్స పొందుతూ మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. మృతుని తమ్ముడు సొల్లు సునీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ క్రిష్టారెడ్డి తెలిపారు.

రబీ సాగు ప్రణాళిక సిద్ధమైంది

- వచ్చే నెల నుంచి రబీ సీజన్ ప్రారంభం



నవతెలంగాణ-గజ్వేల్

వచ్చే నెల నుంచి ప్రారంభమయ్యే రబీ సాగుకు సంబంధించి వ్యవసాయ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.వర్ష కాలంలో తొలుత అనావృష్టి ఆ తర్వాత అతివృష్టి వంటి భిన్నమైన పరిస్థితులతో పంట నష్టానికి రైతులు గురయ్యారు. రబీ సాగుపై ఆశతో ముందుకు సాగుతున్నారు. నవంబర్ నుంచి ప్రారంభమయ్యే రబీ సీజన్‌కు అక్టోబర్ నుంచే వ్యవసాయ అధికారులు ప్రణాళికలు, అంచనాలు వేస్తుంటారు. ఈ సీజన్ లోనూ విత్తన సబ్సిడీ ఊసే లేకపోవడం నిరాశపరుస్తున్నది.

రబీ సీజన్ సంబంధించి గత ఏడాది

3.86 లక్షల ఎకరాలకుపైగా వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చాయి. ఈసారి కూడా అంతే విస్తీర్ణంలో చేపట్ట వచ్చని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఇందులో అత్యధికంగా వరి 3 లక్షల ఎకరాలకు పైగా, ఇతర పంటలు మరో 50-80 వేల ఎకరాలకు పైగా సాగులోకి రావచ్చని భావిస్తున్నారు. ఈసారి గతానికి భిన్నంగా శనగ పంట భారీగా సాగులోకి వచ్చే అవకాశం కనిపిస్తున్నది. సాధారణంగా మొక్కజొన్న కోత తర్వాత ఆ స్థానంలో అక్టోబర్ రెండో వారం నుంచి శనగలు రైతులు వేస్తారు. జిల్లాలో సుమారుగా 20వేల ఎకరాల వరకు శనగ పంట సాగులోకి వచ్చే అవకాశముంది. ఇందుకోసం 20వేల క్వింటాళ్లకు పైగా సబ్సిడీ విత్తనాలు అవసరముంటాయి. కానీ ఈ విత్తుకు సబ్సిడీ లేకపోవడం రైతులను కలవ రపరుస్తున్నది. ఇదిలా ఉండగా నల్లరేగడి భూములు ఎక్కువగా ఉన్న గజ్వేల్‌తో పాటు దుబ్బాక డివిజన్లోని కొన్ని ప్రాంతాల్లో ఈ పంటను భారీగా సాగు చేస్తారు. ఈసారి వ్యవసాయ అధికారులు అంచనకు మించి శనగ పంట సాగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఇతర పంటలది అదే పరిస్థితి

మొక్కజొన్న 30 వేల ఎకరాల వరకు సాగులోకి వచ్చే అవకాశం ఉంది. 4 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉంటున్నాయి. పొద్దు తిరుగుడు 7 వేలపైగా 1,100 క్వింటాళ్ల విత్తనం, వేరుశనగ 4 వేల ఎకరాల్లో సాగులోకి వచ్చే అవకాశం ఉండగా 600 క్వింటాళ్ల విత్తనం అవసరముంటుంది. కానీ సబ్సిడీ లేక రైతులపై భారం పడనుంది. తెలంగాణ రాష్ట్ర విత్తన సంస్థ సబ్సిడీతో ప్రమేయం లేకుండా పూర్తి ధరపై విత్తనాలు అందుబాటులో ఉంచారు. ఇందులో భాగంగా శనగలు జేజీ-11 రకం విత్తనాలు కిలోకు రూ.90 చొప్పున 25 కిలోల బ్యాగును రూ.2,250 విక్రయిస్తున్నారు. దీనిపై రూ.400 అదనంగా సర్వీస్ చార్జి విధిస్తున్నారు. వేరుశనగ కే-6రకం కిలోకు రూ.101.55 చొప్పున 30 కిలోల బ్యాగును రూ.3046.50కు అమ్ముతున్నారు. ఇందుకు సర్వీస్ చార్జి రూ.200 విధిస్తున్నారు. గిర్నర్ రకం కిలోకు 104.555 విక్రయిస్తున్నారు. అదేవిధంగా కుసుమ కిలోకు.రూ82. 85 వరకు విక్రయిస్తారు. నువ్వులు కిలో రూ 196.30కు అమ్ముతారు. వరి, మొక్కజొన్న విత్తనాలు బహిరంగ మార్కెట్లో పూర్తి ధరపై ఎన్నో రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఇది ఇలా ఉండగా జిల్లాలో రబీ సాగుకు సంబందించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారులు అంటున్నారు. ఇప్పటికే శనగ, పొద్దుతిరుగుడు ఇతర విత్తనాలు కావాల్సినవి సిద్ధంగా ఉంచామని చెప్తున్నారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి వరి అత్యధికంగా సాగులోకి వచ్చే అవకాశం ఉందని అంచన వేస్తున్నారు.

హామీలను అమలు చేయడంలో సర్కార్ విఫలం

- కానుకలు ఆశ చూపి మోసం చేసిన ఘనత ప్రభుత్వానిది
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

కాంగ్రెస్ ప్రభుత్వం (సర్కార్) ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేసిన పాపాన పోలేదని, అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. చేర్యాల మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ..సకాలంలో రైతుబంధు అందించకుండా, రుణమాఫీకి అనేక షరతులు పెట్టి రైతులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర పండుగలను చిన్నచూపు చూస్తూ..నేడు బతుకమ్మ చేసుకుంటున్న మహిళలకు కానుకలు ఇస్తామని ఆశ చూపి మోసం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రైతు రుణమాఫీ విషయంలో షరతులు పెట్టి సకాలంలో రైతు బంధు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకొని ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయని పక్షంలో పండుగ తర్వాత ప్రజలను ఏకం చేసి తమ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టి పల్లి సత్తిరెడ్డి, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, పట్టణ కమిటీ నాయకులు రాళ్లబండి భాస్కర్, బోయిని మల్లేశం పాల్గొన్నారు.

మహిళలను గుర్తించిన ఏకైక ప్రభుత్వం గత బీఆర్ఎస్సే

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తించిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణ కేంద్రంలోని చావడి వద్ద శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవి స్నేహ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను గురువారం ఎమ్మెల్యే దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుడి చెరువు వద్ద బతుకమ్మ సంబరాల ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం ప్రతి ఏటా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ఆధ్వర్యంలో అన్ని పండుగలకు గుర్తింపు లభించిందని తెలిపారు. ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా , క్రిస్టియన్లకు దుస్తుల పంపిణీతో పాటు హిందువుల బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ చేస్తూ అన్ని పండుగలను గుర్తించిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ మాత్రమే నని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప, వైస్ చైర్మెన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, కమిషనర్ సుంచు నాగేందర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, మాజీ ఎంపీపీ కరుణాకర్, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షులు పెడుతల ఎల్లారెడ్డి, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు, దేవి స్నేహ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు విడుదల

- ఊపిరి పీల్చుకున్న అధికారులు



నవతెలంగాణ-గజ్వేల్

ప్రత్యేక పాలనలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీల్లో వివిధ పనులు చేపట్టేందుకుగాను ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇప్పటికే పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, కార్మికుల వేతనాలు, కార్యాలయాల నిర్వాణ బాధ్యతలు చూస్తున్న అధికారులు కొన్ని చోట్ల పనులకు స్వయంగా ఖర్చు చేయగా, పలు పంచాయతీలో అప్పులు చేసి పనులు కొనసాగించారు. వేలకు వేలు పెండింగ్లో ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పండుగకు ముందట నిధులు విడుదల చేయడంతో అధికారలు ఊపిరి పీల్చుకున్నారు. . ఈ ఏడాది ఫిబ్రవరి వరకు గ్రామపంచాయతీలు, పాలకమండలి ముగిసింది. ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. గతంలో సర్పంచులు ఉన్న సమయంలో సొంతంగా ఖర్చు చేసి తర్వాత నిధులు విడుదల తీసుకునేవారు. పంచాయతీలో అధికారుల పర్యవేక్షణ వచ్చిన తర్వాత నిధులు లేకపోవడంతో సొంతంగా ఖర్చు చేసేందుకు కొందరు అధికారులు సైతం ధైర్యం చేయలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. నిర్వాణ లోపంతో పారిశుద్ధ్య సమస్య ఏర్పాటు ప్రజలు రోగాల బారిన పడ్డారు. దీని గమనించిన ప్రభుత్వం ఎట్టకేలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో అధికారులకు ఊరట లభించింది. స్వచ్ఛదనం పచ్చదనంతో భాగంగా గ్రామాల్లో జనాభా ఆధారంగా నిధులు కేటాయించారు. 3 వేల లోపు జనాభా ఉంటే రూ.50 వేలు, 8వేల లోపు జనాభా ఉంటే రూ.75 వేలు, 8వేలకు పైగా ఉంటే రూ.లక్ష చొప్పున నిధులు విడుదల చేశారు. విద్యుత్ చార్జీలు గాను రూ1.50 కోట్లు, స్వచ్ఛత, పచ్చదనం-రూ. 2.61 కోట్లు, కార్మికుల వేతనం- రూ.2.19 కోట్లు, ట్రాక్టర్ ఈఎంఐలు-16.72 లక్షలు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. దీంతో ప్రజలు, ప్రత్యేక అధికారులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

పూలను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ ప్రజలది

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-దుబ్బాక

పూలతో పూలనే పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ ప్రజలదే అని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. సద్దుల బతుకమ్మ పర్వదిన సందర్భంగా గురువారం సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్ కేంద్రంలోని పెద్ద చెరువులో మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి, పలువురు కౌన్సిలర్లతో కలిసి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి బతుకమ్మను నిమజ్జనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పువ్వులను పూజించే అతిపెద్ద పండుగ బతుకమ్మ అని.. ఇలాంటి సంస్కృతి కేవలం తెలంగాణ ప్రజలదేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్, పలువురు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఫలించిన డీడీఎఫ్ పోరాటం

- దుబ్బాకకు నూతన ఫైర్ ఇంజన్ వాహనం



నవతెలంగాణ-దుబ్బాక

పాత వాహనాన్ని వెంటనే వెనక్కి తీసుకొని కొత్త ఫైర్ ఇంజన్ వాహనాన్ని మంజూరు చేయాలని కోరుతూ గత కొంతకాలంగా దుబ్బాక డెవలప్మెంట్ ఫోరం (డీడీఎఫ్) చేస్తున్న పోరాటం ఫలించిందని అధ్యక్షులు మాడబోయిన శ్రీకాంత్ స్పష్టం చేశారు. గురువారం దుబ్బాకలో ఆయన మాట్లాడుతూ..ఆరు నెలల కిందట నూతన ఫైర్ ఇంజన్ వాహనాన్ని దుబ్బాక నుంచి సిద్దిపేటకు తరలించారన్నారు. డీడీఎఫ్ తరఫున జిల్లా ఫైర్ ఉన్నతాధికారులను, దుబ్బాక ఎమ్మెల్యే, మెదక్ ఎంపీలను కలిసి పలుమార్లు ఫిర్యాదులు, వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరగా ఈ విషయమై కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తెచ్చిన వెంటనే దుబ్బాకకు అడ్వాన్సుడ్ ఫైర్ ఇంజన్ వాహనాన్ని పంపించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు చెరుకు శ్రీనివాస్ రెడ్డికి, జిల్లా కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

అభివృద్ధి పనులతోనే అందరికీ ఆదర్శంగా నిలుస్తారు

- ములుగు మాజీ సర్పంచ్ బాలమ్మ వర్ధంతి వేడుకలో నాయకులు



నవతెలంగాణ-ములుగు

ప్రజా ప్రతినిధులు అధికారంలో ఉన్నప్పుడు గ్రామాల అభివృద్ధికి చేసిన పనులే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని, అలాంటి నాయకులే అందరికీ ఆదర్శంగా నిలుస్తారని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, జడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు సలీం, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి జుబేర్ పాషా అన్నారు. మండల కేంద్రమైన ములుగుకు చెందిన మాజీ సర్పంచ్ చింతకింది బాలమ్మ వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ములుగులో ఆమె విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ములుగు గ్రామాభివృద్ధిలో బాలమ్మ పాత్ర ఎంతో ఉందన్నారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయించి అందరి మన్ననలు పొందిన మహిళగా నిలిచిందన్నారు. అంతకుముందు ఎన్నో దశాబ్దాలుగా పరిష్కారం కాని అనేక సమస్యలను తీర్చి ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలిచిందన్నారు. బాలమ్మ సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, డీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ భూపాల్ రెడ్డి, కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొన్యాల బాల్ రెడ్డి, కేఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కడపల నరసింహారెడ్డి, రెడ్డిల సంఘం అధ్యక్షులు చికెన్ బాల్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయంలోనే దేవాలయాల అభివృద్ధి



నవతెలంగాణ- గజ్వేల్

కేసీఆర్ హయంలో దేవాలయాల అభివృద్ధి జరిగిందని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని కోట మైసమ్మ దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను దర్శించుకోక నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవీ నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. ప్రతి వార్డులో దేవీ నవరాత్రుల ఉత్సవాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రతి ఏటా మాదిరిగానే బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించుకుంటున్నామని గురువారం సద్దుల బతుకమ్మతో ముగిసిందని చెప్పారు. అందుకు కావలసిన ఏర్పాట్లను పాండవుల చెరువు, ఊర చెరువు, బడే చెరువు మరమ్మతులు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మామిడి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు

మర్మములలోని దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని మర్మముల గ్రామంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత మండపాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గురువారం సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం బైరగోని పశుపతి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మద్దూరు మాజీ వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్, మాజీ సర్పంచులు సుందరగిరి స్రవంతి పరశురాములు గౌడ్, ఊట్ల రవీందర్ రెడ్డి, హనుమాన్ యూత్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు

- బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-మిరుదొడ్డి

అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో సద్దుల బతుకమ్మ పండుగను మహిళలు ఘనంగా నిర్వహించారు. గ్రామ గ్రామాన ఆడపడుచులు గౌరమ్మ బొడ్డెమ్మలను తయారుచేసి పూలతో బతుకమ్మలు పేర్చి గ్రామంలో బతుకమ్మ ఆటపాటలతో అంగరంగ వైభవంగా పండుగ వాతావరణంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి గ్రామంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్యతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు నగరం రవి, శ్రీనివాస్ గౌడ్, బొమ్మరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగలో పాల్గొన్న శ్రీనిత



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేటలో జరిగిన సద్దుల బతుకమ్మ పండుగలో మాజీ మంత్రి హరీశ్‌రావు సతీమణి శ్రీనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు ఆమె తెలిపారు. పూలను పూజించే పండుగ.. ప్రకృతిని ప్రేమించే బతుకమ్మ ఇది తెలంగాణ సొంతం అని అన్నారు. ఇలాంటి గొప్ప పండగ ఎక్కడ ఉండదని, ఇదే మన తెలంగా ప్రత్యేకత అని అన్నారు. ప్రతి ఆడపడుచు సంతోషంగా చేసుకోనే పండగ అన్నారు. అనంతరం కోమటి చెరువు వద్ద జరిగిన నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు

గ్రామ పంచాయతీ సిబ్బందికి సన్మానం



నవతెలంగాణ-తొగుట

మండలంలోని తుక్కాపూర్ గ్రామ పంచాయతీ సిబ్బందిని (ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్) చిక్కుడు స్వామి బతుకమ్మ దసరా పండగ సందర్భంగా గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామాన్ని పరి శుభ్రంగా చేసి వ్యాధుల బారిన పడకుండా కాపాడుతున్న గ్రామ పంచాయతీ కార్మికుల సేవలు మారువలేనివి అన్నారు. వారి సేవలను గుర్తింపుగా నూతన వస్త్రాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని యువత పాల్గొన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



నవతెలంగాణ-మర్కుక్

సద్దుల బతుకమ్మ వేడుకల సందర్భంగా మండల పరిధిలోని 16 గ్రామాల్లో మహిళలు గురువారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంప్రదాయ బద్దంగా మహిళలు, చిన్నారులు సద్దుల బతుకమ్మ అలంకరించి, తెలంగాణ యాస బాషలో రకరకాల పాటలను పాడుతూ బతుకమ్మను చెరువుల్లో నిమర్జనం చేస్తూ విడుకోలు పలికారు.

గ్రంథాలయ చైర్మెన్‌ని సన్మానించిన నాయకులు



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మెన్‌గా నూతనంగా నియమాకమైన కేడం లింగమూర్తిని గురువారం కాంగ్రెస్ నాయకులు హార్థిక శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీలో గత 30 ఏండ్లుగా పార్టీ సిద్ధాంతం కోసం పని చేస్తున్నా నాయకుడని అన్నారు. సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మెన్‌గా నియామకానికి సహకరించిన హుస్నాబాద్ ఎమ్మెల్యే , రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోయిని వంశీకృష్ణ, కొయ్యడ కార్తీక్, బోయిని విజయ్ కుమార్ తదతరులు పాల్గొన్నారు..

మృతుని కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-గజ్వేల్

మున్సిపల్ లోని 13వ వార్డుకి చెందిన కాంట్రాక్టర్ అఖిల్ గుండె పోటుతో ఆకస్మాత్తుగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ ఎన్‌సి.రాజమౌళి గుప్తాలు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అఖిల్ అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందడం చాలా బాధాకరమని అన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట కౌన్సిలర్ బొగ్గుల చందు, నాయకులు మస్జీద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ మతిన్, ఖాసీం, సంతోష్, ఎల్లం, వార్డ్ సభ్యులు, ఉన్నారు.

ఆకట్టుకుంటున్న ధనలక్ష్మి బతుకమ్మ



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణానికి చెందిన నార్ల స్వర్ణలత నాగరాజు దంపతులు సద్దుల బతుకమ్మ రోజున సుమారు 6 గంటల కష్టపడి ధనలక్ష్మి బతుకమ్మను పేర్చారు. ఈ బతుకమ్మ విశేషము అమ్మవారి పైన బంగారు నాణాలతో కురుస్తున్న విధంగా రూపొందించారు. వీరు పేర్చిన ధనలక్ష్మి బతుకమ్మ ఆకట్టుకుంటుంది.

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న నర్సారెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

పట్టణంలోని పద్మశాల భవనంలోఏర్పాటు చేసిన దేవీ నవరాత్రి ఉత్సవాల్లో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనకు భగవంతుని కృప ఉందని అన్నారు. ప్రజలకు సంక్షేమం అందించేందుకు దుర్గామాత కాంగ్రెస్ ప్రభుత్వానికి దీవెనలు అందిస్తుందని అన్నారు. ప్రతిపక్షాలకు తగిన బుద్ధి వచ్చేలా దుర్గామాత చేయాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధికి సహకరించవలసిన ప్రతిపక్షాలు విమర్శలు దిగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడిపల్లి భాస్కర్, నాయకులు నక్క రాములు గౌడ్, సుభాష్ చంద్రబోస్, రామచంద్ర చారి, శ్రీనివాస్, సురేష్, విట్టల్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు




నవతెలంగాణ-తొగుట

మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి గురువారం దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారి దయతో పాడి పంటలతో కలకలలాడాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పొత్కల బాలేష్, బండారు రమేష్ గౌడ్, మిద్దె సంతోష్, కొయ్యడ స్వామి చరణ్ గౌడ్, పిట్ల స్వామి, నాగులపల్లి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణం ఘనం..వినియోగం శూన్యం..!

- వారసంత షెడ్ల నిర్మాణంపై పలువురి కూరగాయల విక్రయస్తుల విమర్శలు
- ఆర్థిక లబ్దికోసం షెడ్ల నిర్మాణం చేపట్టారని రైతుల అగ్రహం







నవతెలంగాణ-బెజ్జంకి

లక్షలు వెచ్చించి ఘనంగా నిర్మించారు. కూరగాయల విక్రయదారులు వారసంత షెడ్లను వినియోగించాలంటేనే..అనాసక్తి చూపుతున్నారు. ప్రణాళికబద్దంగా నిర్మించాల్సిన వారసంత షెడ్లు నేడు వెలవెలబోతున్నాయి. గతంలో మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణ వద్ద రోడ్లపై నిర్వహించిన వారసంత వల్ల వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇబ్బందులను నివారించాలనే సదుద్దేశ్యంతో పశువుల వారసంత వద్ద సకల వసతులతో రూ.లక్షలు వెచ్చించి కూరగాయల విక్రయానికి వారసంత షెడ్ల నిర్మాణం చేపట్టి సుమారు రెండేళ్ల క్రితం ప్రారంభించారు. ప్రారంభంలో కూరగాయల విక్రయస్తులు షెడ్లను సాఫీగా వినియోగిం చుకున్న.. కాలక్రమేణ క్రమక్రమంగా అనాసక్తి చూపుతున్నారు. దీంతో రోడ్డుకిరువైపుల దుకాణాలు ఏర్పాటు చేసుకుని కూరగాయల విక్రయించడానికి ఆసక్తి చూపుతుండడంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారాయి. షెడ్లలో కూరగాయల విక్రయిం చడానికి రైతులు ససేమిరా అంటుండడంతో షెడ్ల నిర్మాణంపై విమర్శలు వినిపిస్తున్నాయి. షెడ్లలో ఊపిరాడక తీవ్ర అవస్థలు పడుతున్నామని కూరగా యల విక్రయదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక లబ్దికోసమే షెడ్ల నిర్మాణం లోపాభూయిష్టంగా నిర్మించారని పలువురు ఆరోపిస్తున్నారు.

యథేచ్ఛగా పన్ను వసూళ్లు..

వారసంత షెడ్లలో వసతుల్లేక కూరగాయలు రైతులు రోడ్లపైనే విక్రయిస్తున్నారు. రోడ్లపై విక్రయించుకుంటున్న సంబధిత గుత్తేదారులు యథేచ్ఛగా వారసంత పన్ను వసూళ్ల చేయడం దోపిడికి పాల్పడడమేనని. .ఇప్పటికైనా సంబంధిత అధికారులు అశ్రద్ధ వహించకుండా రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన వారసంత షెడ్లను వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజాధనం దుర్వినియోగమవ్వకుండా సత్వరం చొరవ చూపాలని విక్రయదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైద్య విద్యార్థులకు అండగా నిలిచిన మాజీ మంత్రి



నవతెలంగాణ-సిద్దిపేట

పేద వైద్య విద్యార్థులకు తన వంతుగా సహకారం మాజీ మంత్రి హరీశ్‌రావు అందించినారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో కొంక రామచంద్రం, శారద దంపతులు తనను కలిసి తమ నలుగురు కుమార్తెలు ఎంబీబీఎస్ సీట్లు పొంది చదువుతున్నారని చెప్పారని, ఈ విషయం విని ఎంతో సంతోషించానని తెలిపారు. పేద దర్జీ దంపతుల కుమార్తెలు పట్టుదలతో కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేశారని, వారికి నా అభినందనలు అని అన్నారు. పెద్ద కుమార్తె మమత 2018లో ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొంది డాక్టర్ చదువు పూర్తి చేసుకుందని, రెండో కుమార్తె మాధవి 2020లో ఎంబీబీఎస్‌లో అడ్మిషన్ పొందగా, ఈ సంవత్సరం మరో ఇద్దరు కుమార్తెలు రోహిణి, రోషిణి ఎంబీబీఎస్‌లో అడ్మిషన్ పొందారని తెలిపారు. కేసిఆర్ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణ బిడ్డలు ఇక్కడే ఎంబీబీఎస్ చదవగలుగుతున్నారని, కేవలం రూ.10 వేల ఫీజుతో డాక్టర్ చదువులు చదవగలుగుతున్నారని, ఇది బీఆర్‌ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ తెచ్చిన అద్భుతమైన మార్పు అని అన్నారు. పిల్లల హాస్టల్ ఖర్చుల విషయంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని కొంక రామచంద్రం దంపతులు నా దృష్టికి తీసుకురాగా, వారికి నా వంతు సహాయం అందించానని తెలిపారు.

సిద్దిపేట: సిద్దిపేట పట్టణంలో వివిధ వార్డుల్లో బతుకమ్మ సంబరాలు...





త్రిశూలధారిని దుర్గాదేవిగా భక్తులకు దివ్యదర్శనం



నవతెలంగాణ-వర్గల్

ప్రసిద్ధ వర్గల్ విద్యాధరి క్షేత్రంలో గురువారం త్రిశూరధారిని దుర్గా దేవి అవతారంలో భక్తులకు విద్యాధరి అమ్మవారు దివ్య దర్శనం కల్పించారు. సకల శక్తి స్వరూపిణి దుర్గాదేవిని ఆరాధిస్తే కష్టాలు వైదొలగి చల్లని చూపుతో అష్టైశ్వర్యాలు, సుఖశాంతులు ప్రాప్తిస్తాయని ఆలయ వ్యవస్థాపక చైర్మెన్, బ్రహ్మశ్రీ, యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి పేర్కొన్నారు. ముఖ్యంగా నవరాత్ర పర్వదినాల సందర్భంగా ప్రతినిత్యం ఏదో ఒక అవతారంలో అమ్మవారు దివ్యరూప దర్శనం ఇస్తుండగా, దుర్గముడనే రాక్షసుడిని సంహరించి నందున అమ్మవారు దుర్గాదేవిగా ఆవిర్భవించినట్లు పురాణాలు చెబుతున్నట్లు స్పష్టం చేశారు. కాగా మొదటగా విద్యాదరి క్షేత్రంలో తెల్లవారుజామున గణపతి పూజ, పుణ్యాహవాచనము, మహాభిషేకము, కలశస్థాపన, చతుషష్టు పచార పూజ, మూలమంత్ర హవనము, చండీ హెూమము తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించగా, క్షేత్రానికి విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు. కాగా ఈ కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడిపల్లి భాస్కర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించగా, మాజీ ఎంపీపీ మోహన్, మాజీ జెడ్పీటీసీ ప్రభుదాస్ గౌడ్, నాయకులు సుభాష్ చంద్రబోస్, మల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, బాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు




























నవతెలంగాణ-నంగునూరు

తెలంగాణ ప్రజలు ఎంతో వైభవంగా నిర్వహించుకొనే బతుకమ్మ సంబరాల్లో చివరి రోజైన గురువారం నంగునూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం తీరొక్క పూలు తెచ్చి బతుకమ్మ, గౌరమ్మను పేర్చారు. గౌరమ్మకు సద్దులను నైవేద్యంగా పెట్టి పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రధాన కూడళ్లలో బతుకమ్మలు పెట్టి ఆటపాటలతో మహిళలు సందడి చేశారు. చిన్నలు నుంచి పెద్దల వరకు బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం చెరువుల్లో, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేసి ప్రసాదాలు అందజేసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, పాల్గొన్నారు.

దుబ్బాకరూరల్: దుబ్బాక మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబరాలు మహిళలు ఘనంగా నిర్వహించారు. చిన్న, పెద్ద తేడా లేకుండా మహిళలు అంతా కలిసి ఈ కార్యక్రమంలో అందరు పాల్గొన్నారు. చిన్నారులు, ఆడపడుచులు బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ పూల పండుగ పాటలు గ్రామ గ్రామానా మారుమ్రోగాయి. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై తొమ్మిది రోజు సద్దుల బతుకమ్మ వరకూ ఆడపడుచులు ఆడి పాడి ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించుకున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక ఉట్టిపడేలా బతుకమ్మ ఉత్సవాల్లో ఆడపడుచులు తీరక్క పువ్వుతో బతుకమ్మ అలంకరించి తమ కోరికలను తీర్చాలని పోయిరా గౌరమ్మ అంటూ చెరువులో నిమర్జనం చేశారు. రాత్రి వేళల్లో సాగనంపుతారు. రాత్రి వేళల్లో పలు గ్రామాల్లో ప్రధాన కచేరిల వద్ద మహిళలు బతుకమ్మ ఆటలు ఆడారు.

తొగుట: మండలంలోని అన్ని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ సంబరాలు మహిళలు గురువారం ఘనంగా నిర్వహించారు. మాగం అమావాస్య నుంచి మొదలు తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మ సంబరాల్లో హిందూ సంప్రదాయం ప్రకారం తంగేడు, గునుగు, బంతి, తదితరులు పులతో బతుకమ్మలను అలంకరించారు. మహిళలు బతుకమ్మ పాటలతో గత చరిత్రను గుర్తు చేసే విదంగా పాటలు పాడి బతుకమ్మ అడ్డుకున్నారు.

కొండపాక: సద్దుల బతుకమ్మ పండుగను కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో మహిళలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొండపాక, దమ్మకపల్లి మినహా మిగతా గ్రామాలన్నింటిలో సద్దుల బతుకమ్మ పండుగ మహిళల ఆనంద ఉత్సవాల మధ్య జరిగింది. పూలను సేకరించి పెద్ద బతుకమ్మలు తయారుచేసి కూడళ్ళ వద్ద పెట్టి ఆటలు ఆడి సాయంత్రం ఆయా గ్రామాల్లో స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. మునురుపల్లి మండల కేంద్రంలో తాజా మాజీ సర్పంచ్ పోల్కంపల్లి జయంతి నరేందర్ ఇంటిలో తయారుచేసిన అతి భారీ బతుకమ్మ

దుబ్బాక: సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా గురువారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట 11వ వార్డులో మహంకాళి దేవాలయం, రాజరాజేశ్వర స్వామి దేవాలయం వద్ద వార్డు కౌన్సిలర్ నందాల శ్రీజ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పలువురు మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు ఘనంగా చేసుకున్నారు. మహిళలు, చిన్నారులు బతుకమ్మ, దాండియా నృత్యాలు చేస్తూ కోలాహలంగా గడిపారు. అనంతరం అందంగా పేర్చిన సద్దుల బతుకమ్మలను పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

గజ్వేల్: సద్దుల బతుకమ్మ రోజు గజ్వేల్ పట్టణంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. బతుకమ్మలను ఇంటి నుంచి చెరువు కట్ట వద్దకు తీసుకుపోయే సమయంలో మార్గమధ్యంలో భారీ వర్షం కురిసింది. సద్దుల బతుకమ్మ సందర్భంగా చిన్నల్లు పెద్దలు నూతన దుస్తులతో ముస్తాబై బతుకమ్మలతో వెళ్లిన ఆడపడుచులు అందరూ తడిచి ముద్దయ్యారు. గజ్వేల్ మండలంలో చాలా గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామ గ్రామాన భారీ వర్షంలోనే సంబరాలు నిర్వహించుకున్నారు. మహిళలు బతుకమ్మలు చేత పట్టుకొని కొందరు నడవగా మరికొందరు గ్రామ నడిబొడ్డున బతుకమ్మలు పెట్టి పాటలు పాడడం కనిపించింది. అంతేకాకుండా భారీ వర్షంతో 6 గంటల వరకు ఇంకా ఇంటిలోనే ఉన్న బతుకమ్మలు చాలావరకు ఉన్నాయి. ప్రత్యేక వాహనాలు ఉన్నవారు ఒక్కరి ఇద్దరు వెళ్లి చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేయడం కనిపించింది.



దుర్గామాత రూపంలో: దుర్గామాత రూపంలో సద్దుల బతుకమ్మ రోజున బతుకమ్మను ఏర్పాటు చేశారు. సద్దుల బతుకమ్మ రోజు ప్రత్యేకంగా గౌరమ్మను ఏర్పాటు చేస్తారు. బతుకమ్మతోపాటు దుర్గామాత రూపంలో గౌరమ్మను కూడా తీసుకపోయిన దృశ్యం కనిపించింది.

రాయపోల్: బతుకమ్మ పండగ సంబరాల్లో చివరి రోజున సద్దుల బతుకమ్మ వేడుకలను మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతిరోజు ప్రత్యేక పేరుతో బతుకమ్మను మహిళలు ఎంతో ప్రతిష్టాత్మకంగా బతుకమ్మను పూజిస్తారు. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ, రెండో రోజు అటుకుల బతుకమ్మ, మూడవరోజు ముద్ద పప్పు బతుకమ్మ, నాలుగవ రోజు నాన్న బియ్యం బతుకమ్మ, ఐదో రోజు అట్ల బతుకమ్మ, ఆరవ రోజు అలిగిన బతుకమ్మ, ఏడవ రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదవ రోజు వెన్న ముద్దుల బతుకమ్మ, తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మ వరకు బతుకమ్మ సంబరాలను కుటుంబ సభ్యులు, ఆడపడుచులు అత్యంత వైభవంగా చేసుకుంటారు. బతుకమ్మను తంగేడు, గునుగు, చామంతి పూలతోపాటు తీరొక్క పూవులతో బతుకమ్మ తయారుచేసి కోలాటాలతో బతుకమ్మ ఆటపాటలతో మహిళలు సందడి చేశారు. బతుకమ్మ సంబరాల్లో భాగంగా తీరొక్క పూవోలే తీసుకువచ్చి రంగురంగుల బతుకమ్మలను అందంగా పేర్చి తయారు చేశారు. బతుకమ్మలను గౌరీ మాతగా పూజిస్తూ బతుకమ్మ ఆట పూర్తయిన తర్వాత మహిళలతో పాటు కుటుంబ సభ్యులు అందరూ కలిసి గ్రామాలలోని చెరువులో నిమజ్జనం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగ గుర్తించి ఘనంగా నిర్వహిస్తోంది.

పూల జాతర: తొమ్మిది రోజులుగా కొనసాగిన పూల జాతర సద్దుల బతుకమ్మతో ముగిసింది. ప్రకృతిలో లభించే పూలతో సుందరంగ అలంకరించి పువ్వులనే పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణా రాష్ట్రానిది. బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. చిన్న, పెద్ద తేడా లేకుండా మహిళలు అంతా కలిసి ఈ కార్యక్రమంలో అందరు పాల్గొన్నారు. చిన్నారులు, ఆడపడుచులు బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ పూల పండుగ పాటలు గ్రామ గ్రామానా మారుమ్రోగాయి. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై తొమ్మిది రోజుల సద్దుల బతుకమ్మ వరకూ ఆడపడుచులు ఆడి పాడి ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించుకున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక ఉట్టిపడేలా బతుకమ్మ ఉత్సవాల్లో ఆడపడుచులు తీరక్క పువ్వుతో బతుకమ్మ, అలంకరించి తమ కోరికలను తీర్చాలని పోయిరా గౌరమ్మ అంటూ చెరువులో నిమర్జనం చేశారు.

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మండలంలో సద్దుల బతుకమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. ప్రజ్ఞాపూర్‌లో దుర్గామాత రూపంలో గౌరమ్మ ను పేర్చారు. మండల పరిధిలోని అహ్మదీపూర్ ఆదర్శ కాలనీలో బతుకమ్మ పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు పట్టుకొమ్మగా నిలిచే బతకమ్మ పండుగలో తొమ్మిది రోజుల చివరి ఘట్టమైన సద్దుల బతుకమ్మ నవరాత్రులతో ముగిసింది. ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా, వాడవాడలా పూలపండుగ సంబరాలు జరిగాయి. తంగేడు, గునుగు, కట్ల, బంతి, చామంతి, సీతజడలు వంటి పూలతో రోడ్లు పూలవనంలా మారాయి. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన సంబరాలు ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా పువ్వులను పూజించే పండుగ బతుకమ్మ పండుగ తెలంగాణలో ప్రత్యేకం. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ తెలంగాణ ఆడపిల్లలందరూ అత్యంత సంతోషంగా చేసుకున్నారు. తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మను నిర్వహించే మహిళలు 9 దొంతరలుగా బతుకమ్మను పేర్చి, అంతా ఒకచోట చేరి ఆడి పాడి బతుకమ్మలను గంగమ్మలో నిమజ్జనం చేస్తారు. కులాలకు అతీతంగా, పేద ధనిక తారతమ్యం లేకుండా, చిన్న పెద్ద అందరూ కలిసి ఘనంగా చేసుకున్నారు. ఈ బతుకమ్మ పండుగలో భాగంగా గ్రామంలో మహిళలు, చిన్న పెద్దలు తరలివచ్చి గ్రామంలో సందడిగా మొదలై బతుకమ్మ నిమార్జనంతో ముగుస్తుంది.

బెజ్జంకి: మండల పరిధిలోని అయా గ్రామాల్లో సద్దుల బతుకమ్మ పండుగ సంబురాలను ఆడపడుచులు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి భక్తి శ్రద్ధలతో గౌరమ్మను పూజించారు. మండల కేంద్రంలోని లక్ష్మి నరసింహ స్వామి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన బతుకమ్మ సంబురాల్లో ఆడపడుచులు పెద్ద సంఖ్యలో హజరై ఉత్సహంగా బతుకమ్మ పండుగను చేసుకున్నారు.

ములుగు: ములుగు మండలంలోని అన్ని గ్రామాల్లో వాడ వాడల్లో ఎంగిలిపువ్వు నుంచి సద్దు బతుకమ్మ వరకు తొమ్మిది రోజులు తీరక్క పూలతో 9వ రోజు సద్దుల బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన ములుగులో తీరక పూల అలంకరణతో బతుకమ్మను ముస్తాబు చేసి ఆటపాటలతో చిన్న పెద్ద ఆడపడుచులు అందరు కలిసి బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

మిరుదొడ్డి: సద్దుల బతుకమ్మ పండుగతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మగా పేర్చి బతుకమ్మ ఆటలు ఆడుతూ సంతోషాన్ని పంచుకున్నారు. మిరుదొడ్డి మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని గ్రామాల్లో అధికారులు పండుగ చేయడంతో మహిళలు నూతన వస్త్రాలను ధరించి గ్రామాల్లో బతుకమ్మ ఆటలు ఆడారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు అన్ని గ్రామాల్లో సంతోషంగా చేసుకున్నారు. పూలతో దైవాన్ని పూజించే సంస్కృతి మనదని అలాంటి పూలని ఒకచోట పేర్చి బతుకమ్మగా కొలవడం తెలంగాణ సంస్కృతికే అద్దం పడుతుందన్నారు. బతుకమ్మ సంబరాల అనంతరం పోయి రావమ్మ బతుకమ్మ అంటూ చెరువుల్లో నిమజ్జనం చేశారు. బతుకమ్మ నిమజ్జన అనంతరం మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.